Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శుక్రవారం, మే 15, 2026 | సంపుటి - 20 | సంచిక 237 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసలు

### తనకుమంచి స్నేహితుడని అంటూ పొగడ్తలు
### ఇరు దేశాల మధ్య శిఖరాగ్ర సదస్సులో ట్రంప్



బీఇంగ్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత జిన్‌పింగ్ మధ్య గురువారం బీజింగ్‌లో ఉన్నత స్థాయి సమావేశం ప్రారంబమైంది. ఈ సందర్భంగా ఇరు దేశాల బృందాలను ఉద్దేశించి మాట్లాడిన అధ్యక్షుడు ట్రంప్ చైనా అధినేతపై ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్‌ను కలవడం తనకు గౌరవమని, ఆయన తనకు మంచి స్నేహితుడని కొనియాడారు. 2లో

# చివరిగింజ వరకు కొంటాం

### రైతులకు మంత్రి ఉత్తమ్ హామీ
### పొంగులేటితో కలసి పాలేరు ధాన్యం కనుగోళ్లు పరిశీలన




ఖమ్మం : రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. గురువారం కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కారింస్తోందని పేర్కొన్నారు.

తరువాయి 2లో






### పీఎంజే జ్యువెలరీ షాపు
# దోపిడీ కేసు

### కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసులు
సుబోధ్ గ్యాంగ్ పనిగా గుర్తించి అరెస్ట్

మీడియా ముందుకు ముగ్గురు దోపిడీ దొంగలు

రెక్కీ నిర్వహించి దోపిడీకి పాల్పడ్డట్లు ఎస్పీ వివరణ

కరీంనగర్ : కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యువెలరీ షాపులో కాల్పులు జరిపి.. నగలు దోపిడీకి పాల్పడింది సుభోద్ సింగ్ గ్యాంగ్ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జరిగాసింగ్ అని చెప్పారు.

### 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో
# సర్ ప్రక్రియ

జాబితాలో ఉభయ తెలుగు రాష్ట్రాలు

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన




న్యూఢిల్లీ : దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల 'ప్రత్యేక విస్తృత సవరణ' (సర్) మూడవ దశను ప్రారంభించ నున్నట్లు భారత ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లడఖ్ మినహా దేశం మొత్తం 'సర్' పరిధిలోకి వస్తుందని ఈసీ వెల్లడించింది. 2లో

## భద్రాద్రిని దర్శించుకున్న తుమ్మల



### ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ

భద్రాద్రి కొత్తగూడెం : భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అర్చకులు 2లో

## మోడీ హయాంలోనే
# 93 పేపర్లు లీక్

### నీట్-యూజీ 2026 రద్దు
### మోడీ సర్కార్ ఫెయిల్

ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు

కేంద్రం తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం



**నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్షరద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతపదేండ్లుగా ప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు.**

హైదరాబాద్ : నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరి తమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2లో

## కెటిఆర్‌తో ఆస్ట్రేలియా
# హైకమిషన్ భేటీ

### కీలక అంశాలపై ఇరు నేతల చర్చలు



హైదరాబాద్ : మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుని భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ కలిశారు. నందినగర్ నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీతో సమావేశం అయ్యారు. పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు.

తరువాయి 2లో



## పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం

**వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్**

**వారానికి ఒకరోజు నో వెహికిల్ డే**

**సిఎం రేఖాగుప్తా పలు నిర్ణయాలు ప్రకటన**

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ప్రజా రవాణా వినియోగంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కూడా కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పొదుపు సూత్రాల పిలుపు మేరకు ఢిల్లీ ప్రభుత్వం పలు సంస్కరణాత్మక చర్యలను ప్రకటించింది. ముఖ్యమంత్రి రేఖాగుప్తా ఆధ్వర్యంలో తీసుకున్న ఈ నిర్ణయాలు ప్రభుత్వ ఖర్చులు తగ్గించడం, ఇంధన వినియోగ నియంత్రణ 2లో



## 40 అంశాలకు
# క్యాబినెట్ ఆమోదం

రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే 25 ప్రాజెక్టులకు ఓకే

ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులకు అనుమతి

ఎపి కేబినేట్‌లో కీలక నిర్ణయాలు

అమరావతి : డేటా సెంటర్లు, ఆటోమొబైల్, సిమెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెటుబడుల ఆమోదంపై చర్చించింది. కర్నూలు విమానాశ్రయం పీపీపీ మోడల్‌లో అభివృద్ధి ప్రతిపాదన చర్చకు వచ్చింది. వివిధ సంస్థలకు భూముల కేటాయింపులపై క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఎంఎస్‌ఎంఈలకు నిధుల సౌలభ్యానికి ప్రత్యేక ఏర్పాటుపై చర్చించింది. సాగునీటి కాల్వల విస్తరణ, రోడ్లు, పరిశ్రమలకు మౌలిక సదుపాయాలపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఇకపోతే మంత్రివర్గ సమావేశానికి వివిధ శాఖల కార్యదర్శులు సకాలంలో రాకపోవడంపై సీఎం చంద్రబాబు 2లో

*ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 40కి పైగా అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే 25 ప్రాజెక్టులతో పాటు ఉద్యోగాల కల్పనపై కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శుద్ధ ఇంధనం, ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజ్, బయోగ్యాస్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. శుద్ధ ఇంధన రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలిపేలా క్యాబినెట్ చర్యలు తీసుకుంది. ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ ప్రణాళిక కు ఆమోదం తెలిపింది.*

## ఆర్డీటీ ఓ సంస్థ కాదు..సేవా వ్యవస్థ



ఆర్డీటీ ద్వారా అద్భుతమైన సేవా కార్యక్రమాలు

మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్య

శ్రీ సత్యసాయి జిల్లా : ఆర్డీటీ ఓ సంస్థ కాదని.. గొప్ప సేవా వ్యవస్థ అని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఆర్డీటీ ద్వారా అద్భుతమైన 2లో

## రైతులను పట్టించుకోని
# కేంద్ర ప్రభుత్వం



**స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు బుట్టదాఖలు**

**జొన్న, మక్కలను రాష్ట్ర ప్రభుత్వమే కొంటోంది**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

భద్రాద్రి కొత్తగూడెం,మే14 : స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కేంద్రప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం రైతులను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. దళారుల దయాదాక్షిణ్యాలపై రైతులు ఆధారపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కోసం మొక్కజొన్న, జొన్నలను 2లో

# మోడీ హయాంలోనే 93 పేపర్లు లీక్

ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమపిల్లలనునీట్ ఎగ్జామ్ కు ప్రిపేర్ చేయించారని... వారి ఆశలన్నీగల్లంతవడంబాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డెకేడ్' శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలుజరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్-యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి-నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్-నెట్, నీట్-పిజిరద్దుఅయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్రద్దునేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దనిభరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

# జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసలు

ఇరు దేశాలకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు. 'మా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. పొరపొచ్చాలు వచ్చినప్పుడు కూడా మాట్లాడుకుని త్వరగా పరిష్కరించాము. మీరు ఒక గొప్ప నాయకుడు. ఇలా నేను మిమ్మల్ని ప్రశంసించడం కొందరికి నచ్చకపోవచ్చు. కానీ నేను ఉన్నది ఉన్నట్టు చెబుతున్నాను. చైనా, అమెరికాలు కలిసికట్టుగా అద్భుత భవిష్యత్తువైపు అడుగులు వేస్తున్నాయి ' అని ట్రంప్ అన్నారు. ఈ పర్యటన కోసం తాను అమెరికాకు చెందిన అత్యుత్తమ వ్యాపారవేత్తలను తీసుకొచ్చానని కూడా ట్రంప్ చెప్పారు. వారందరికీ చైనా అధినేత అంటే గౌరవమని చెప్పారు. ఇదే అతిపెద్ద శిఖరాగ్ర సమావేశమని కూడా వ్యాఖ్యానించారు. ఇక ఈ సమావేశాల ప్రారంభంలో చైనా అధినేత జిన్‌పింగ్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య సహకారం ఉండాలని అభిలషించారు. చైనా-యూఎస్ బంధం స్థిరంగా ఉండాల్సిన ఆవశ్యకత గురించి కూడా మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచం దృష్టి తమ రెండు దేశాలపైనే ఉందని అన్నారు. గత శతాబ్దంలో చూడని మార్పులు ప్రస్తుతం జరుగుతున్నాయని చెప్పారు. అంతర్జాతీయంగా అల్లకల్లోల పరిస్థితులు ఉన్నాయని, ప్రపంచం నాలుగు రోడ్ల కూడలిలో ఉందని అభిప్రాయపడ్డారు. చైనా, యూఎస్‌లు తమ దౌత్య బంధంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని కూడా వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ శిఖరాగ్ర సమావేశంలో ఎన్‌విడియా సంస్థ సీఈఓ జెన్సన్ హువాంగ్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ సీఈఓ టిమ్ కుక్ పాల్గొంటున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం, ఇరాన్ యుద్ధం, టెక్నాలజీతో పాటు తైవాన్ అంశంపై కూడా చర్చించేందుకు ట్రంప్ చైనాలో పర్యటిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, ప్యాసింజర్ విమానాలను చైనాకు మరింతగా ఎగుమతి చేసేలా ఒప్పందం కుదుర్చుకునేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు.

# భద్రాద్రిని దర్శించుకున్న తుమ్మల

పూర్ణకుంభంతో ప్రత్యేక స్వాగతం పలికారు. శ్రీ సీతారామచంద్ర స్వామికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా తొలిసారి ఎన్టీఆర్ క్యాబినెట్‌లో ప్రమాణ స్వీకారం చేసి నేటికి నలభై ఏళ్ళు పూర్తి అయ్యాయి. 1986 మే 14 తేదీన తుమ్మల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దర్శనానంతరం తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. శ్రీరాముడు అంటే భద్రాచలం అనేలా భక్త రామదాసు రామాలయం పునఃనిర్మాణం చేశారన్నారు. పూజ్యులు ఎన్టీఆర్ పాలనలో భద్రాచలం రామాలయం అభివృద్ధి చేసే భాగ్యం దక్కిందని తెలిపారు. రూ.351 కోట్లతో రామాలయం పునరాభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారన్నారు. నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో భద్రాద్రి రాముని ఆశీస్సులు ఎప్పుడూ ఉన్నాయన్నారు. భద్రాచలం ప్రాంతం నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు, దేశ రాజధాని ఢిల్లీ, చండీగఢ్, దాద్రా- నగర్ హవేలి- దమన్-దియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మూడో దశ 'సర్' పక్రియ నిర్వహించనున్నారు. కాగా, 'సర్' మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), జనాభా గణనకు రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏల) సహాయంతో ఇంటింటికి వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలు తనిఖీ చేస్తారని ఈసీ తెలిపింది. మే 30 నుంచి అక్టోబర్ 14 వరకు 'సర్' మూడో దశ పక్రియ జరుగుతుందని పేర్కొంది. జూలై 5 నుంచి అక్టోబర్ 21 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ కొనసాగుతుందని ఈసీ వెల్లడించింది.

# ఆర్డీటీ ఓ సంస్థ కాదు.. సేవా వ్యవస్థ

సేవా కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. తాను చేపట్టిన యువగళం పాదయాత్రలో తాను ఆర్డీటీ సేవలు చూశానని.. ఇక్కడ అందుతున్న సేవలు తనను బాగా కదిలించాయని చెప్పుకొచ్చారు. గురువారం ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిని మంత్రి లోకేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. తాను చేపట్టిన పాదయాత్ర అనంతపురం దాటినా అనేకసార్లు ఆర్డీటీ గురించి తెలుసుకున్నానని తెలిపారు. గతంలో అనేక ఇబ్బందులు వచ్చాయని పేర్కొన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ డెరెక్టర్ మాంచో ఫెర్రర్‌తో చాలాసార్లు మాట్లాడి ఫాలో అప్ చేశామని మంత్రి లోకేశ్ తెలిపారు. అద్భుతమైన సేవా కార్యక్రమాలు చేస్తోండటంతో తాను మద్దతు ఇచ్చానని అన్నారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఇలాంటి సంస్థలు, ప్రజల కష్టాలు తెలుసుకోవడం కోసమే తాను పాదయాత్ర చేశానని ప్రస్తావించారు. ఆర్డీటీ సంస్థకు సేవ చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఆర్డీటీకి అందరూ అండగా నిలవాల్సిన బాధ్యత ఉందని చెప్పుకొచ్చారు. కష్టకాలంలో ఓర్పు, సహనంతో సేవలు చేస్తూ వచ్చిన మాంచోకి ధన్యవాదాలు తెలిపారు. ఆర్డీటీ సేవలు రాయలసీమకే కాదని.. ఏపీకి విస్తరించాలని కోరుకుంటున్నామని అన్నారు. ప్రేమతో సేవ చేయడం మాంచో కుటుంబం ఆశయమని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అంతకుముందు బత్తలపల్లిలో మంత్రి నారా లోకేశ్‌కు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఘనస్వాగతం పలికారు. పెద్దఎత్తున స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు లోకేశ్‌ను చూడటానికి తరలివచ్చారు. మంత్రి నారా లోకేశ్ రాకను పురస్కరించుకొని పెద్దఎత్తున టీడీపీ శ్రేణులు బాణాసంచా కాల్చారు. బత్తలపల్లి సెంటర్ నుంచి టీడీపీ శ్రేణులతో కలిసి లోకేశ్ భారీ ర్యాలీ తీశారు. అందరికీ అభివాదం చేస్తూ లోకేశ్ ముందుకు సాగారు.

# వరుస విజయాలతో ఆర్‌సిబి దూకుడు

**శతకంతో మరోమారు చెలరేగిన కోహ్లీ**

**ఒత్తిడిలోనే బాగా అడుతానన్న విరాట్**

న్యూఢిల్లీ,మే14 : ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దూకుడుగా ఆడుతోంది. ఈ క్రమంలో వరుస విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. తాజాగా కోల్‌కతాపై సూపర్ విక్టరీ సాధించింది. విరాట్ కోహ్లీ 105 పరుగుల అజేయ శతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ నిలిచాడు. ఐపీఎల్‌లో 9వ సెంచరీని నమోదు చేశాడు. అయితే, తనకు శతకం కంటే మ్యాచ్‌ను ముగించడమే అత్యంత ముఖ్యమైన విషయమని కోహ్లీ తెలిపాడు. ఒత్తిడి వల్ల మనలోని మెరుగైన ఆట బయటకు వస్తుందని అభిప్రాయపడ్డాడు. సెంచరీ తర్వాత పెద్దగా సంబరాలు చేసుకోలేదు. ఈ రెండు పాయింట్లు ఎంత ముఖ్యమో మాకు తెలుసు. జట్టు విజయంలో భాగం కావడం ఎప్పుడూ ఆనందమే. చివరివరకూ క్రీజ్‌లో ఉంటే గెలిచే అవకాశాలు ఎక్కువ. గత రెండు మ్యాచుల్లో పరుగులు చేయలేదు. ఆ వెలితి నన్ను లోలోపల తినేయడం మొదలు పెట్టింది. నేను బాగా ఆడతాను. బంతిని సరిగ్గా కొడతానని నాకు తెలుసు. ఇప్పుడు కూడా నేనేమీ కొత్తగా ప్రయత్నించలేదు. ఒత్తిడి ఉండటం సహజమే. కానీ, అది కూడా మనలోని మెరుగైన ఆటతీరును బయటకు తీసుకొచ్చేందుకు సాయపడుతుంది. నెట్స్‌లోనూ నేను విపరీతంగా సాధన చేస్తా. గత వైఫల్యాలు కూడా మనల్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి. ఏం చేయాలనే దానిపై ఓ స్పష్టత వచ్చేలా చేస్తాయని కోహ్లీ తెలిపాడు. ఈ మ్యాచ్‌లో నేనేమీ కొత్తగా ప్రయత్నించలేదు. నా ఆటపై నమ్మకం పెట్టుకున్నా. ఎక్కువగా బౌండరీలు కొట్టేందుకు చూశా. ఖాళీల్లో బంతిని పంపా. అలాగే ఎప్పుడు సిక్స్‌లు కొట్టాలనే దానిపైనా స్పష్టతతో ఉన్నా. మ్యాచ్‌లో ఎప్పుడూ వెనకబడిపోకుండా ఉండేందుకు సింగిల్స్, డబుల్స్ పైనా దృష్టిపెట్టా. ఈ విషయాలు నన్ను సంతోషపెట్టాయి. రికార్డులను బ్రేక్ చేయడం సంగతి అటుంచితే.. నాకు ఆడటం ఇష్టం. నా మనసులోని భావం అదే. ఈ స్థాయిలో ఆడడమే ఎంతో గౌరవం. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తూనే ఉంటా.

# పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసు

గురువారం కరీంనగర్‌లో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ గౌస్ ఆలం విలేకర్లతో మాట్లాడుతూ ఈ దోపిడీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొత్తం 161.4 తులాల బంగారు ఆభరణాలను ఈ గ్యాంగ్ దొంగతనం చేసిందని వివరించారు. మొత్తం వీటి విలువ రూ. 82 లక్షలు ఉంటుందన్నారు. బిహార్‌కు చెందిన సుభోద్ గ్యాంగ్‌కి.. గోల్డెన్ తీఫ్‌గా పేరుందని గుర్తు చేశారు. పీఎంజే జ్యువెలరీ షాపులో ముందుగా రెక్కీ నిర్వహించి.. అనంతరం ఈ దోపిడీని ఈ గ్యాంగ్ చేసిందన్నారు. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లోని మెహతాబ్ వద్ద ఈ ముఠా సెల్ ఫోన్, సిమ్స్ కొనుగోలు చేసినట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్‌లలో బంగారు షాపులపై ఈ గ్యాంగ్ రెక్కీ నిర్వహించిందని చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జాగీరా సింగ్ సహా ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను అరెస్ట్ చేశామని సీపీ తెలిపారు. వీరు నకిలీ ఆధార్, నకిలీ బైక్ నెంబర్లు, నకిలీ పేర్లతో తిరుగుతూ ఈ దోపిడీలకు పాల్పడతారని సీపీ గౌస్ ఆలం వివరించారు. రెండు నెలల ముందు ఈ గ్యాంగ్ తెలంగాణకు వచ్చిందని సీపీ గౌస్ ఆలం వివరించారు. ముగ్గురు నిందితులను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియాకు చూపించారు. నిందితులను 12 రోజుల పాటు దోపిడీ దొంగల కేసులో పోలీసులు ఆపరేషన్ నిర్వహించారు. బంగారం దోపిడీ కేసులో సుబోధ్ సింగ్ ప్రధాన నిందితుడు అని పోలీసులు తెలిపారు. దోపిడీ తర్వాత రైలు, బస్సు ద్వారా తప్పించుకునేందకు ప్రయత్నించారు. దోపిడీకి రెండు నెలల క్రితమే రెక్కీ నిర్వహించారని పేర్కొన్నారు. ఈ గ్యాంగ్‌పై పలు రాష్ట్రాల్లో కేసులు ఉన్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్ ఝార్ఖండ్ రాష్ట్రాల్లో సుబోధ్ సింగ్ ముఠా చోరీలకు పాల్పడిందన్నారు. చాకచక్యంగా నిందితులను పట్టుకున్న పోలీసులను సీపీ అభినందించారు. పిస్టల్స్‌తో వచ్చిన ఐదుగురు దొంగలు.. సిబ్బందిపై కాల్పులు జరిపి సుమారు కిలోన్నరకుపైగా బంగారం ఎత్తుకెళ్లారు. దొంగలు జరిపిన కాల్పుల్లో షాపు సేల్స్ మేనేజర్ ముస్తాక్ అలీతో పాటు సిబ్బంది కమల్, మధుకర్, సెక్యూరిటీ గార్డు రాజేశ్ తీవ్రంగా గాయపడ్డారు. షాపులోకి ఎంటరైన ఐదు నిమిషాల్లోనే పని ముగించుకున్న దొంగలు.. బయటికి పరుగెత్తి పల్సర్, అపాచీ బైక్‌లపై పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు పది నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన సిబ్బందిని ఆస్పత్రికి తరలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఎంపీ బండి సంజయ్ ఆఫీస్, జిల్లా జడ్జి ఇంటికి సమీపంలోనే సినీ ఫక్కీలో భారీ చోరీ జరగడంతో తీవ్ర కలకలం రేగింది.

# పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం

ప్రజా రవాణా ప్రోత్సాహంపై కేంద్రీకృతమై ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, ఇంధన వినియోగాన్ని నియంత్రించడం లక్ష్యంగా ఢిల్లీ ప్రభుత్వం ఉద్యోగులకు వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం రేపటి నుంచే అమల్లోకి వస్తుందని సీఎం రేఖా గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఈ విధానం వల్ల ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వాహనాల సంఖ్య తగ్గి, కాలుష్య నియంత్రణకు తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడంలో భాగంగా సీఎం కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను నాలుగుకు పరిమితం చేశారు. ఇందులో రెండు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని నిర్ణయించారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. పౌరుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో 'నా భారతదేశం ? నా కర్తవ్యం' పేరుతో ప్రత్యేక ఉద్యమాన్ని ఢిల్లీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం 90 రోజుల పాటు కొనసాగనుంది.ఇంధన పొదుపు, ప్రజా రవాణా వినియోగం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులు, ఉన్నతాధికారులు ప్రతి సోమవారం తప్పనిసరిగా ఢిల్లీ మెట్రోలోనే ప్రయాణించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిని 'మండే మెట్రో' పేరుతో ప్రత్యేక కార్యక్రమంగా అమలు చేయనున్నారు. ఈ నిర్ణయం ద్వారా ప్రజారవాణా వినియోగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, ట్రాఫిక్ రద్దీ తగ్గించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. సామాన్య ప్రజలు కూడా వారంలో కనీసం ఒక రోజైనా 'నో వెహికిల్ డే' పాటించాలని ప్రభుత్వం సూచించింది. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి, సైకిళ్లు, మెట్రో, బస్సులు వంటి పర్యావరణహిత రవాణా మార్గాలను వినియోగించాలని కోరింది. ప్రభుత్వ శాఖలు వచ్చే ఆరు నెలల వరకు పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు చేయొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైతే ఇప్పటికే ఉన్న వాహనాలనే వినియోగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇది ప్రభుత్వ ఖర్చులను తగ్గించడమే కాకుండా, వనరుల సమర్థ వినియోగానికి దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను 10 శాతం పెంచుతూ ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు తెలిపింది. ప్రభుత్వ వ్యయ నియంత్రణలో భాగంగా వచ్చే ఏడాది వరకు అన్ని విదేశీ అధికారిక పర్యటనలను పూర్తిగా రద్దు చేశారు. అత్యవసర పరిస్థితులు మినహా విదేశీ ప్రయాణాలకు అనుమతి ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఢిల్లీ ఇప్పటికే వాయు కాలుష్య సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పర్యావరణ పరిరక్షణకు కీలకంగా మారే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వర్క్ ఫ్రం హోమ్, మెట్రో వినియోగం, నో వెహికిల్ డే వంటి చర్యలతో వాహనాల సంఖ్య తగ్గి కాలుష్యం నియంత్రణలోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

# రైతులను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. కొనుగోళ్లతో రాష్ట్రంపై రూ.4 వేల కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురువారం మంత్రి తుమ్మలకు పామాయిల్ రైతులు ఆత్మీయ సత్కారం చేశారు. మంత్రిగా నలభై సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా తుమ్మలను సత్కరించారు. అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో మంత్రి తుమ్మల ఆత్మీయ సత్కార కార్యక్రమంలో పది ఉమ్మడి జిల్లాల పామాయిల్ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. పెరిగిన సాగు వ్యయాలకు ఎంఎస్‌పి సరిపోవని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకొచ్చారు. వరి ఎంఎస్‌పిని కేవలం 72శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం పెంచిందని దుయ్యబట్టారు. మొక్కజొన్న పైనా మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. 10శాతం పెంపుతో రైతులకు న్యాయం జరగదని తెలిపారు. మద్దతు ధరలు కనీసం 30 నుంచి 40 శాతం వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌పి ప్రకటించడం కాదని.. కొనుగోలు చేయడమే ముఖ్యమని తెలిపారు. ప్రతి పంటలో 75శాతం దిగుబడిని కేంద్రం కొనాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న, జొన్నలను ఖాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.పత్తి, వేరుశనగ, సోయాబీన్ ఓ÷ూఖలపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల ఆదాయం పెంచే సంకల్పం కేంద్రానికి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పామాయిల్ సాగుకు దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు చేతుల మీదుగా శ్రీకారం చుట్టామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో పామాయిల్ సాగు విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చానని ప్రస్తావించారు. అకాల వర్షాలతో ధాన్యం, మొక్కజొన్న రైతులు కష్టాలు పడుతున్నారని చెప్పుకొచ్చారు. ఆ సమస్యలు చూసిన వారు పామాయిల్ సాగు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థ విధానాల వల్లే తెలంగాణ రైతాంగం అవస్థలు పడుతోందని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేంద్రం సహకరించకున్నా మద్దతు ధరకు పంటలు కొనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతాంగం కోసం ఏడాదిలోనే లక్ష కోట్ల రూపాయలకుపైగా ఖర్చు పెట్టామని తెలిపారు. ఆదివాసీ బిడ్డలకు ఉద్యోగాలు దక్కేలా చంద్రబాబు జీఓ నంబర్ -3 తీసుకువచ్చారని ప్రస్తావించారు. నలభై ఏళ్ల క్రితం రైతాంగం కష్టాలు ఈ తరం వారికి లేవని చెప్పుకొచ్చారు. మారిన కాలానుగుణంగా అన్నదాతలు ప్రకృతి వైపరీత్యాలు, కోతుల బెడద, చీడ పీడలు లేకుండా పామాయిల్ సాగు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎందరో పోటీ పడ్డా ఎన్టీఆర్ వ్యవసాయ కళాశాల అశ్వారావుపేటకే ఇచ్చారని ప్రస్తావించారు. హార్టికల్చర్ హబ్‌గా అశ్వారావుపేట ఉందని వ్యాఖ్యానించారు. వ్యవసాయ కళాశాలకు తోడు ఉద్యాన కళాశాల అశ్వారావుపేట కు మణిహారమని ఉద్ఘాటించారు. చంద్రబాబు హెలికాప్టర్ నుంచి చూసి అశ్వారావుపేట పచ్చదనంపై ఆశ్చర్య పోయారని తెలిపారు. యుద్ధాలు జియో పాలిటిక్స్ వల్ల యూరియా సరఫరాలో కేంద్రం అనుకున్న స్థాయిలో సరఫరా చేయలేదని అన్నారు. ప్రతి ఏటా మన దేశంలో లక్ష కోట్ల రూపాయలు పామాయిల్ దిగుమతి అవుతోందని వివరించారు. పామాయిల్ ఇంపోర్ట్ ట్యాక్స్ పెంచితే మన రైతాంగానికి మద్దతు ధర పెరుగుతుందని మంత్రి తుమ్మల అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణకు పామాయిల్ సాగు వరంగా మారుతుందని చెప్పుకొచ్చారు. లక్షలాది రైతుల తలరాత మారేలా పామాయిల్ సాగు విస్తరణ చేసే అవకాశం భగవంతుడు తనకు ఇచ్చారని తెలిపారు. ఎన్ని పదవులు చేశామని కాదని.. ముందు తరాలకు మేలు చేసేలా తన రాజకీయ ప్రస్థానం ఉంటుందని ఉద్ఘాటించారు. మంత్రిగా నలభై ఏళ్ల ప్రస్థానంలో భద్రాద్రి శ్రీ రాముడు దయవల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి చేసే భాగ్యం దక్కిందని చెప్పుకొచ్చారు. తన చివరి శ్వాస వరకు ప్రజాసేవలో ఉంటానని స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో తనకు సహకరించిన ముఖ్యమంత్రులు, అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

# మరోమారు తెరపైకి ఫార్ములా కేసు

**కెటిఆర్ తదితరులకు ఎసిబి నోటీసులు**

**జూలై 31న విచారనకు రావాలని ఆదేశాలు**

హైదరాబాద్ : తెలంగాణలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. జులై 31న విచారణకు రావాలని కోర్టు ఆదేశించింది. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలతో సహా ఎఫ్ఈఓ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించింది. ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఇప్పటికే లోతైన దర్యాప్తు జరిపి అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా మాజీ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ పేర్కొంది. వీరితో పాటు ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్ఈఓ సంస్థపై కేసులు నమోదయ్యాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు మళ్లించారన్నదే ప్రధాన అభియోగం. హెచ్ఎండీఏ ఖాతా నుంచి సుమారు 55 కోట్ల రూపాయలను ఎఫ్ఈఓ సంస్థకు బదిలీ చేసినట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. ముందస్తు అనుమతులు లేకుండానే ఇంత భారీ మొత్తాన్ని విదేశీ సంస్థకు ఎలా చెల్లించారన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అరవింద్ కుమార్ సహా పలువురు ప్రతినిధులను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు.

# చివరిగింజ వరకు కొంటాం

యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీచేశారు.

# కెటిఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషన్ భేటీ

తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ప్రస్తావించారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న కేటీఆర్‌తో ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై మాట్లాడారు. తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా తీసుకునే చర్యలపై చర్చించారు. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీపై సంతోషం వ్యక్తం చేశారు కేటీఆర్. ఈ భాగస్వామ్యం ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# 40 అంశాలకు క్యాబినెట్ ఆమోదం

ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంధన పొదుపుపై మొదటి అజెండాగా చర్చిద్దామని మంగళవారమే సీఎం చెప్పారు. సమావేశంలో అధికారులు లేకపోవడంపై సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను చంద్రబాబు ప్రశ్నించారు. సమాచారం సరిగా ఇవ్వలేదా అని సీఎం ప్రశ్నించగా.. ఇచ్చినట్లు విజయానంద్ సమాధానమిచ్చారు. సమయానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చర్చించారు.

# ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

**ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్ పరీక్షలు**

**మార్పులకు సిద్దం అవుతున్న బోర్డు**

హైదరాబాద్,మే14 : ఇంటర్ విద్యా విధానంలో తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కీలక మార్పులు చేపట్టేందుకు సిద్ధమైంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసింది. కొత్త విధానంలో సైన్స్, మ్యాథ్స్, భాషా విభాగాల్లో పరీక్షల సరళి, మార్కుల విధానం, ప్రాక్టికల్స్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటి వరకు ఇంటర్ సెకండియర్‌లో మాత్రమే ప్రాక్టికల్స్ నిర్వహించగా, కొత్త విధానంలో ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టనున్నారు. ప్రత్యేకంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కొత్త విధానం ప్రకారం.. ఇంటర్ ఫస్టియర్‌లో, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనుంది. దీంతో విద్యార్థులు కేవలం థియరీకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. మ్యాథమేటిక్స్ బోధనలోనూ కీలక మార్పులు తీసుకురానుంది. సంప్రదాయ పద్ధతికి బదులుగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను అమలు చేయనుంది. దీంతో విద్యార్థులు సూత్రాలను అర్థం చేసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించుకోవడం, కాన్సెప్ట్ ఆధారిత విద్యనభ్యసించడం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మ్యాథ్స్‌లో 75 మార్కులకు ÷నైల్ పరీక్ష నిర్వహిస్తుండగా, కొత్త విధానంలో దాన్ని 60 మార్కులకు తగ్గించనుంది. అదేవిధంగా యాక్టివిటీలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ప్రాధాన్యం పెంచే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఇంటర్ పరీక్షలు 100 మార్కులకు నిర్వహించగా, ఇకపై వాటిని 80 మార్కులకు నిర్వహించనున్నట్లు సమాచారం. మిగిలిన మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రాక్టికల్స్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ద్వారా కేటాయించే అవకాశం ఉంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ వంటి భాషా విభాగాల్లో 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించనుంది. ఇందులో ప్రాజెక్టులు సెమినార్లు, అసైన్‌మెంట్లు, క్లాస్‌రూమ్ పనితీరు ఆధారంగా మార్కులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంతమేర తగ్గే అవకాశం ఉందని విద్యా నిపుణులు భావిస్తున్నారు. ఒక్క ÷నైల్ పరీక్ష ఆధారంగా కాకుండా, ఏడాది పొడవునా విద్యార్థుల పనితీరును అంచనా వేసే విధానం అమల్లోకి రానుంది. ఈ సంస్కరణలు జాతీయ విద్యా విధానం(ఔఇఖ)కు అనుగుణంగా తీసుకువస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా విద్యా నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటర్ విద్యా విధానంలో వస్తున్న ఈ మార్పులు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## కరీంనగర్‌లో ఘనంగా 'వరలక్ష్మి ఇ-మోటార్స్' ఎలక్ట్రిక్ స్కూటర్ల షోరూమ్ ప్రారంభం




కరీంనగర్ టౌన్, మే 13(ది క్రైమ్ న్యూస్)పర్యావరణ పరిరక్షణ, కాలుష్య రహిత ప్రయాణమే లక్ష్యంగా కరీంనగర్ నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'వరలక్ష్మి ఇ-మోటార్స్' ఎలక్ట్రిక్ స్కూటర్ల షోరూమ్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. భగత్ నగర్‌లోని పెద్దమ్మ టెంపుల్ రోడ్‌లో నూతనంగా నిర్మించిన ఈ షోరూమ్‌ను ముఖ్య అతిథులు వైభవంగా ప్రారంభించారు.ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. వారు సాంప్రదాయబద్ధంగా రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్‌ను అధికారికంగా ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ వేడుకలో సునీల్ రావు తో పాటు పలువురు స్థానిక కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.41వ డివిజన్ కార్పొరేటర్ నాంపల్లి రేణుక-శ్రీనివాస్,43వ డివిజన్ కార్పొరేటర్ పొన్నం మొండయ్య-లక్ష్మి,12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ-వేణు,44వ డివిజన్ కార్పొరేటర్ చదగొండ కవిత-బుచ్చిరెడ్డి ఉన్నారు.ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులు మాట్లాడుతూ పెరుగుతున్న ఇంధన ధరలకు ప్రత్యామ్నాయంగా, పర్యావరణానికి మేలు చేసే అత్యాధునిక ఎలక్ట్రిక్ వాహనాలను కరీంనగర్ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రాజకీయ నాయకులు, డివిజన్ వాసులు, వ్యాపార ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## రైతుల పక్షాన నిలిచినందుకే అక్రమ కేసులు బీజేపీ నేతల ఆగ్రహం

**సుల్తానాబాద్ కోర్టుకు హాజరైన బిజెపి నాయకులు**



సుల్తానాబాద్, మే 13(ది క్రైమ్ న్యూస్) రైతుల హక్కుల కోసం వడ్ల కొనుగోలులో జరుగుతున్న అక్రమ కటింగ్‌లకు వ్యతిరేకంగా పోరాడినందుకు తమపై అక్రమ కేసులు బనాయించారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. 2023 ఏప్రిల్‌లో సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుగ్లాంపల్లి , ఇతర ఐకెపి కేంద్రాలలో రైస్ మిల్లర్లతో కుమ్మక్కై, తాలు పేరుతో రైతులకు నష్టం చేకూరుస్తున్న విధానాలపై బీజేపీ నాయకులు ఆందోళనలు చేపట్టారు. మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు ఆధ్వర్యంలో రైతుల పక్షాన నిలిచి, ఎలాంటి కటింగ్ లేకుండా వడ్లు కొనుగోలు చేయాలని నిర్వహించిన ఐకెపి కేంద్రాల పరిశీలన, రాస్తారోకో కార్యక్రమాలపై అప్పట్లో పోలీసులు ఐపిసి సెక్షన్ 143, 341, 149 ల కింద అక్రమంగా కేసులు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా బుధవారం సుల్తానాబాద్ కోర్టుకు బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ జిల్లా అధ్యక్షులు రావుల రాజేందర్, పెద్దపల్లి జిల్లా నాయకులు పోల్సాని సంపత్ రావు తంగెళ్ళ రాజేశ్వరరావు, దాడి సంతోష్, ఎర్రోళ్ల శ్రీకాంత్, బెజ్జంకి దిలీప్, ఉప్పు కిరణ్, కొల్లూరి సంతోష్, ఉషణ అన్వేష్, వేగోలం మల్లికార్జున్ తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, కోర్టుల చుట్టూ తిప్పినా రైతుల శ్రేయస్సు కోసమే బీజేపీ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

## అంబలి ఆకలిని తీరుస్తుంది.

**టిపిసిసి ప్రధాన కార్యదర్శి శీను బాబు.**

రామగిరి,మే 13(ది క్రైమ్ న్యూస్):-అంబలి ఆకలిని తీరుస్తుంది అని రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శీను బాబు అన్నారు. కమాన్ పూర్ మండల కేంద్రంలో చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అంబలి కేంద్రంలో పలువురికి ఆయన అంబలి అందజేశారు. ఈ సందర్భంగా శీను బాబు మాట్లాడుతూ తీవ్ర ఎండల వల్ల అలసిపోయిన ప్రజలకు అంబలి ఒక టానిక్ లా పనిచేస్తుందని దీంతో ప్రతినిత్యం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే చత్రపతి శివాజీ వారు వివిధ ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టడం హర్షనీయమని అన్నారు. ప్రజాసేవలో ముందుండే చత్రపతి శివాజీ వారికి హృదయపూర్వక ధన్యవాదాలు అని అన్నారు. బుధవారం మాదాసు రాధమ్మ రాజయ్యల జ్ఞాపకార్థం మాదాసు మహేష్ అంబలి మీ అందజేశారు. ఈ కార్యక్రమంలో తొట్ల తిరుపతి యాదవ్, సయ్యద్ అన్వర్ ,కిషన్ రెడ్డి, జంగేపల్లి పెద్ద శ్రీనివాస్, చత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు మల్యాల శేఖర్, ఉపసర్పంచ్లు కొత్తపల్లి సతీష్, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.



# నీట్ పరీక్ష రద్దుకు నిరసనగా బిఆర్‌యస్‌వి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

**అడ్డుకున్న పోలీస్ లు పోరాటం చేసి దహనం చేసిన విద్యార్థి నాయకులు**



కరీంనగర్ టౌన్, మే13(ది క్రైమ్ న్యూస్) : నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి మోదీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమంటూ, నీట్ పరీక్ష రద్దుకు నిరసనగా బీఆర్ఎస్వీ జిల్లా మాజీ అధ్యక్షుడు , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌక్ లో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేయడం జరిగింది.ఈ సందర్భంగా పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే,దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును బీజేపీ సర్కార్ అంధకారంలోకి నెట్టింది., ఇలా పేపర్ లీకేజీ ల ద్వారా ఇప్పటి వరకు 53 లక్షల పై చిలుకు విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడింది అని అన్నారు. ఇలా పేపర్ లీకేజీ కాకుండా జరిగితే దారుణమైన శిక్షలను విధించేలా ప్రత్యేక చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు . పరీక్ష నిర్వహణలో 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ'ఘోరంగా విఫలమైంది.పగలు రాత్రి కష్టపడి చదివిన విద్యార్థులకు మోదీ ప్రభుత్వం ఇచ్చే బహుమతి పేపర్ లీకేజీలా, బీజేపీ పాలిత రాష్ట్రాలు ఇప్పుడు పేపర్ లీకేజీలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులను తుంగలో తొక్కి, వేల కోట్ల రూపాయలు సొమ్ము చేసుకోవడానికే ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించడం లేదు. నైతిక బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి అని, విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం సిగ్గుచేటు, లీకు వీరులను కఠినంగా శిక్షించాలి, ఇక ముందు ఇలా జరుగకుండా వీరికి ఉరిశిక్ష విధించాలి ,అకడమిక్ క్యాలెండర్ దెబ్బతినకుండా వెంటనే పకడ్బందీగా పరీక్షా తేదీలను ప్రకటించాలి.ఈ ధర్నాలో బీఆర్ఎస్వీ శాతవాహన యూనివర్సిటీ బీ ఆర్ యస్ వి ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్ , నగర బీ ఆర్ యస్ వి అధ్యక్షులు బొంకూరి మోహన్ , నారదాసు వసంత్ రావు , పబ్బతి శ్రీనివాస్ రెడ్డి , వడ్లకొండ పరుశరామ్, అన్వేష్, సోహెల్ , క్రాంతి , శ్రవణ్ , రవి గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్‌ను కఠినంగా శిక్షించి, సంజయ్ కుమార్ మంత్రి పదవి తొలగించాలి

**కమాన్ చౌరస్తా వద్ద భారత జాతీయ మహిళా సమాఖ్య నిరసన**




కరీంనగర్ టౌన్, మే13(ది క్రైమ్ న్యూస్) : మైనర్ బాలికపై అత్యాచార కేసులో ఫోక్సో కేసు నమోదై ఆరు రోజులైన బండి సాయి భగీరథ్ ను తక్షణమే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని,అలాగే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను తక్షణమే మంత్రి పదవి నుండి తొలగించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్.ఎఫ్. ఐ డబ్ల్యు కరీంనగర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బీర్ల పద్మ, కొట్టె అంజలి డిమాండ్ చేశారు.బండి సంజయ్ కొడుకు సాయి భగీరథ్ ను అరెస్ట్ చేయాలని బుధవారం స్థానిక కమాన్ చౌరస్తా వద్ద భారత జాతీయ మహిళా సమాఖ్య కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన తెలపడం జరిగిందని అంజలి, పద్మ పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై బిజెపి కి చెందిన నేతల అఘాయిత్యాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని,దేశంలో అనేక మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు,వారి కుటుంబ సభ్యులు మహిళలపై,మైనర్ బాలికలపై అత్యాచారాలు చేస్తూ,హత్యలు చేస్తున్నారని ఆరోపించారు.కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు,కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కొడుకు సాయి భగీరథ్ మైనర్ బాలికపై అత్యాచారం చేశాడని బాలిక తల్లి ఆరు రోజుల క్రితం ఫోక్సో కేసు పెడితే ఇప్పటి వరకు ఆయన ను అరెస్ట్ చేయలేదంటే సభ్యసమాజం తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని,రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ కేసు నమోదైనప్పటికీ చూసి చూడనట్లుగా వ్యవహరించడం వెనుక ఆంతర్యం ఏంటో అర్థం కావడం లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి,పోలీస్ అధికారులకు మహిళలమీద ఏమాత్రం గౌరవం ఉన్నా తక్షణమే నిందితుడు బండి భగీరథ్ ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బండి సంజయ్ ను మంత్రి పదవి నుండి తొలగించాలని పద్మ,అంజలి డిమాండ్ చేశారు.బండి భగీరథ్ ను అరెస్ట్ చేయాలనీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదవి నుండి బండి సంజయ్ కుమార్ ను తొలగించాలని ఎన్.ఎఫ్.ఐ డబ్ల్యు కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కమాన్ చౌరస్తా వద్ద నిరసన తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు అఖిల,సహాయ కార్యదర్శి సావిత్రి,నాయకురాళ్ళు గుగులోతు రజిత,కె.సంధ్య, ఎ.రాధ,భూక్యా ముని, ఎం.సరోజన, ఎస్.భాగ్య,సంధ్య, ఎ.చంద్రకళ,ఎం.పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకు తుమ్మల చిరునామా....

**నాలుగు దశాబ్దాల మంత్రివర్గ ప్రస్థానం ఆదర్శనీయం**

**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**

కరీంనగర్ టౌన్, మే13(ది క్రైమ్ న్యూస్) : ఆరు సార్లు ఎమ్మెల్యే, ఐదు పర్యాయాలు మంత్రి, రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధిక కాలం మంత్రిగా సేవలందించిన నాయకుడిగా ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక గుర్తింపు పొందారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు.1986 మే 14న తొలిసారి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తుమ్మల నాగేశ్వరరావు 40 ఏళ్ల అనంతరం కూడా ప్రజాసేవలో అదే నిబద్ధతతో కొనసాగడం అరుదైన రాజకీయ ప్రస్థానమని ఆయన కొనియాడారు. మంత్రి తుమ్మల 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానం నేపథ్యంలో బుధవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 40 ఏళ్ల మంత్రివర్గ ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రలో ఒక విశిష్ట ఘట్టమని ఆనందం వ్యక్తం చేశారు.1986 మే 14న తొలిసారి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తుమ్మల నాగేశ్వరరావు, నాలుగు దశాబ్దాల అనంతరం కూడా ప్రజల కోసం అదే నిబద్ధతతో మంత్రిగా కొనసాగడం అరుదైన విషయం అన్నారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఐదు పర్యాయాలు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన, రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధిక కాలం దాదాపు 20 సంవత్సరాలు మంత్రిగా సేవలందించిన నాయకుడిగా రికార్డు సాధించారని తెలిపారు.ప్రజాసేవను రాజకీయాలకంటే ఉన్నతంగా భావిస్తూ, ఏ శాఖ బాధ్యతలు చేపట్టినా పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి అభివృద్ధి పనులను ముందుకు నడిపించిన నాయకత్వం తుమ్మల ప్రత్యేకత అని కొనియాడారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రయాణం నుంచి నేటి వరకు అనేక కీలక రాజకీయ పరిణామాలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచారని గుర్తుచేశారు. ముక్కుసూటితనం, నిజాయితీ, రైతుల పట్ల ఉన్న మమకారం, పరిపాలనా అనుభవం ఆయనను ప్రజలకు మరింత చేరువ చేశాయని పేర్కొన్నారు. “రాజకీయాల్లో పదవులు వస్తాయి పోతాయి... కానీ రైతు అనే గౌరవాన్ని ఎవరూ తీసుకోలేరు” అనే ఆయన మాటలు ప్రజాసేవ పట్ల ఆయన అంకితభావానికి నిదర్శనమని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా రైతు సంక్షేమం, ధాన్యం కొనుగోలు, సాగునీటి సదుపాయాలు, వ్యవసాయాభివృద్ధి కోసం కృషి చేస్తూ రైతాంగానికి అండగా నిలుస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని వెలిచాల రాజేందర్ రావు ఆకాంక్షించారు.

## ముంపు ప్రాంతాల పంటలు కొనుగోలు చేయండి

**తహశీల్దార్‌కు బాధిత రైతుల విజ్ఞప్తి**

తిమ్మాపూర్, మే13(ది క్రైమ్ న్యూస్) : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామక్రిష్ణకాలనీకి చెందిన బాధిత రైతులు బిజెపి నాయకులతో కలిసి తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డికి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఎల్ఎండి డ్యాంలో ముంపుకు గురై ఎఫ్టిఎల్ కు దూరంగా భూములకు సంబంధించిన 70 మంది రైతులు 25 ఏళ్లుగా ఒకే సీజన్ వ్యవసాయం చేస్తూ వచ్చిన పంటలను అమ్ముకుంటుండగా స్థానిక కొనుగోలు కేంద్రాలలో రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, వ్యవసాయం తప్ప వేరే పనులు తెలవని రైతుల పంటలను మానవతా దృక్పథంతో కొనుగోలు చేయాలని బిజెపి నాయకుడు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వర చారీ తహశీల్దార్ కు విజ్ఞప్తి చేశారు.గతంలో ఇటువంటి సమస్యలెదురైతె రైతు ద్వారా ధ్రువీకరించిన పత్రంనకు వ్యవసాయ అధికారి ద్వారా అనుమతి తీసుకొన్న తర్వాత కొనుగోలు చేశారని అదే విధంగా కొనుగోలుకు సహకరించాలని రైతులు కోరగా ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కారం చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.రైతులు గోనెల భూమయ్య,గంగు రాజమల్లు, గోనెల పర్శయ్య,కోతి మల్లేశం,గోనెల రాజు,ఆవుల లచ్చయ్య,గంగు తిరుపతి, అట్ల అంజయ్య,పురం సంపత్, బీజేపీ నాయకులు గడ్డం అరుణ్, కోతి రాజు ఉన్నారు.

## రైతులకు నష్టం జరగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

**ధాన్యం లిఫ్టింగ్ వేగవంతం చేయాలి**

**తూకంలో కోతలు, బీ-గ్రేడ్ పేరుతో అక్రమ తగ్గింపులు లేకుండా చూడాలి**

**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**



కరీంనగర్ టౌన్, మే13(ది క్రైమ్ న్యూస్)ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వాస్తవ తూకంతోనే కొనుగోలు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులను నష్టపరిచే విధంగా వ్యవహరించవద్దని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలిచాల రాజేందర్ రావు అధికారులను కోరారు. బుధవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తూకం విషయంలో పారదర్శకత పాటిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం లిఫ్టింగ్ ఆలస్యం అవుతున్న ప్రాంతాల్లో అదనంగా రైస్ మిల్లులను కేటాయించి, రవాణా మరియు లాజిస్టిక్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు. లిఫ్టింగ్ సమస్యలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే బీ-గ్రేడ్ పేరుతో రైతుల ధాన్యంపై అన్యాయంగా తగ్గింపులు చేయడం సరికాదన్నారు. ధాన్యం నాణ్యత విషయంలో అధికారులు న్యాయబద్ధంగా, పారదర్శకంగా వ్యవహరించాలని, రైతులకు నష్టం కలిగించే విధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. రైతుల కష్టార్జిత ఫలితానికి తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తోందని, ప్రతి గింజను కొనుగోలు చేసే దిశగా చర్యలు కొనసాగుతు న్నాయని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్ విచారణ

**వారం రోజులకు వాయిదా వేసిన కోర్టు**

**బెయిల్‌పై నేడు తీర్పు ఇవ్వనున్న హైకోర్టు**



హైదరాబాద్ : బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిషటన్‌పై విచారణను హైకోర్టు వెకేషన్ బెంచ్ వారం రోజులకు వాయిదా వేసింది. నిందితుడు బండి సాయి భగీరథ్ తరపు న్యాయవాది హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. హైకోర్టు విచారణ వారం రోజులు వాయిదా వేసింది. భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు, మధ్యంతర బెయిల్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో గురువారం సుదీర్ఘ విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, మధ్యంతర బెయిల్‌పై నిర్ణయాన్ని శుక్రవారానికి వాయిదా వేయగా, ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వారం రోజుల పాటు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక అంశాలను లేవనెత్తారు. కరీంనగర్‌లో బాధితురాలిపై తప్పుడు కేసు నమోదు చేశారని కోర్టుకు తెలిపారు. బాధితురాలి తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో, కరీంనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేశారని వివరించారు. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో ఈ కేసులో సాక్ష్యాధారాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని పీపీ వాదించారు. అయితే, దీనిపై స్పందించిన హైకోర్టు.. 'ప్రతిసారీ నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడని పదే పదే చెప్పాల్సిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించింది. భగీరథ్ తరపున అడ్వకేట్ కృష్ణకాంత్ తన వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో భగీరథ్‌పై 'పోక్సో' చట్టం వర్తించదని, ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించామని తెలిపారు. యువతి మైనర్ అనే నెపంతో విచారణకు వెళ్లే సమయంలో భగీరథ్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అందుకే బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. 'బండి సంజయ్ కుమారుడు కావడంతోనే నిరాధారంగా పోక్సో చట్టాన్ని ప్రయోగించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పొలిటికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. నిందితుడిని సామాన్యుడిలాగే పరిగణించి న్యాయం చేయాలి' అని ఆయన కోరారు. ఇక, తమ వాదనలు వినిపించడానికి సమయం కావాలని బాధితురాలి తరఫు న్యాయవాది కోరడంతో, కోర్టు శుక్రవారం మధ్యంతర బెయిల్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. కాగా, ముందస్తు బెయిల్ రావడానికి వారం సమయం పట్టేలా ఉండటంతో, ఆ వారం లోపు అరెస్టు కాకుండా ఉండేందుకు బండి భగీరథ్ న్యాయవాది మధ్యంతర బెయిల్ కోరారు. దీనిపై నేడు కోర్టు ఇచ్చే ఆదేశాలు బండి భగీరథ్‌కు కీలకం కానున్నాయి. బండి సాయి భగీరథ్ ఇంటరిమ్ ప్రొటెక్షన్ (మధ్యంతర రక్షణ)పై విచారణను వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు తెలిపింది.బాలికపై లైంగిక దాడి, ఇతర నేరారోపణల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. బండి సాయి భగీరథ్ కోసం గాలింపు చర్యలు మొదలు పెట్టిన పేట్ బషీరాబాద్ పోలీసులు మంగళవారం కరీంనగర్‌కు వెళ్లి, విచారణ నిమ్మితం భగీరథ్‌ను వెంట తీసుకొని బుధవారం మధ్యాహ్నం 2గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని అతడి మేనమామ వంశీకృష్ణకు నోటీసులు కూడా అందజేశారు. అయితే బుధవారం మధ్యాహ్నం విచారణకు పోలీసులు సిద్ధంగా ఉన్నా నిందితుడు మాత్రం హాజరుకాకుండా డుమ్మాకొట్టాడు. పైగా వ్యక్తిగత కారణాలతో తాను ఈ రోజు విచారణకు హాజరుకాలేక పోతున్నానని, పూర్తి ఆధారాలతో ఈ నెల 15న హాజరై పోలీసులకు సహకరిస్తానని, రెండు రోజుల గడువు ఇవ్వాలంటూ పోలీసులకు పంపిన ఈ-మెయిల్‌లో పేర్కొన్నాడు. ఇప్పుడు హైకోర్టు బెయిల్ పిటిషన్పై విచారణ వాయిదా వేయడంతో 15న విచారణకు హాజరవుతాడా లేదా అన్న అనుమానం ఉంది.

# సంపాదకీయం

## కాన్వాయ్‌ల కార్లు తగ్గితే పొదుపు కాదు !

అధికార పార్టీ నేతల విన్యాసాలు మొదలయ్యాయి. చమురు సంక్షోభం దృష్ట్యా ఖర్చులు తగ్గించుకోవాలని, వర్క్ ఫ్రమ్ మోమ్ పెరగాలని, బంగారం కొనొద్దని ఇలా..ప్రధాని పలు సూచనలు చేశారు. వాటిని బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, ఎన్‌డిఎ పాలిత సిఎంలు స్వాగతించారు. ఇందులో కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను మాత్రమే తగ్గించారు. ప్రధాని కూడా కాన్వాయ్ తగ్గించారు. నిజానికి రాజకీయంగా దుబరా ఖార్చుల గురించి ఆలోచించడం లేదు. ఓ వైపు విమాన ఇంధన ధరలు పెంచడంతో విమానాలను రద్దు చేస్తున్నారు. ఇది సామాన్యులపై పెనుభారం మోపుతోంది. విదేశీయానం అంటే ప్రజలు ఎంజాయ్ చేయడానికి వెళ్లడం లేదు. తమ పిల్లల దగ్గరకు వెళ్లాలన్న తల్లిదండ్రులకు వియారన టిక్కెట్ ధరలు తడిసి మోపెడు అవుతున్నాయి. వీటిని ఆదా చేసేందుకు ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. కాన్వాయ్‌ల తగ్గింపుతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాదు. ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా ఉన్న వందలాది పతకాలు, రాజకీయ పార్టీల ఖర్చులు వంటివి తగ్గాలి. శాసనమండళ్లతో పెద్దగా పనిలేదు. జడ్పీటిసి, ఎంపిటిసిలతో పెద్దగా పనిలేదు. వీటిని తగ్గించాలి. ప్రజాప్రతినిధులు రెండేసి పెన్షన్లు తీసుకుంటున్నారు. ఈ పెన్షన్లను పూర్తిగా రద్దు చేయాలి. ఈ ఖర్చు ఎంతో లెక్క కట్టాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న వేళ ఎక్కడ ఖర్చులు తగ్గించాలో మోడీ చెబితే బాగుంటుంది. ఆచరిస్తే మరీ మంచిది. ప్రజాస్వామ్యం పేరుతో ప్రజాప్రతినిధులు ప్రజల డబ్బుతో విలాసాలు చేస్తున్నారు. దీనిపై ప్రధాని మోడీ దృష్టి సారించాలి. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మన దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆర్థిక  సంక్షోభం దిశగా పయనిస్తున్న తీరును చూస్తున్నాం. వరుసగా  స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి విలువ పతనం కొనసాగడం, ద్రవ్యోల్బణం అడ్డు అదుపులేకుండా పెరగడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ క్రమంలో దేశ ఆర్థిక వ్యవస్త బలోపేతానికి పొదుపు చర్యలు తీసుకోవాల్సిందే. కఠిన చర్యలకు ఉపక్రమించాలి. కేవలం కాన్వాయ్‌ల కార్లు రద్దుతో చేతులు దులుపుకుంటే సరిపోదు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేసిన పొదుపు సూచనలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేశాయి. స్టాక్‌మార్కెట్లు కుప్పకూలి, లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి కావడం, విదేశీ పెట్టుబడు దారులు పెద్ద ఎత్తున నిధులు వెనక్కి తీసుకోవడం వంటి పరిణామాలన్నీ ఆర్థికసంక్షోభ తీవ్రతకు అద్దం పడుతున్నాయి.అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న తీరు మరింత ఆందోళనకరం. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి చేరి 13 నెలల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం సామాన్య కుటుంబాల పై తీవ్రమైన భారం మోపుతోంది. పప్పుధాన్యాలు, కూరగాయలు, వంటనూనెలు, పాల ఉత్పత్తుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరుగు తుండటం, అసంఘటిత రంగంలో ఉపాధి క్షీణించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల నిధులను తెగ్గోయడం వంటి చర్యలు ఇప్పటికే ప్రజల కొనుగోలు శక్తిని దారుణంగా దెబ్బతీశాయి. దీనికితోడు ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదని సూచనలు చేస్తున్నారు. ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా కూడా ఇదే విషయం చెప్పారు. ధరాఘాతం నుండి ప్రజలకు ఊరటనిచ్చే చర్యలు తీసుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం మరింతగా భారాలు మోపేందుకు కసరత్తు చేయడం దారుణం! అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరుగుతుండటాన్ని సాకుగా చూపుతూ పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచడానికి ఇప్పటికే సిద్ధమైంది. 'పెట్రో ధరలు పెరగవని నేను చెప్పలేను అంటూ సాక్షాత్తు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ ప్రకటించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇదే మాదిరి కొనసాగితే పెట్రోల్, డీజిల్  ధరల పెంపు తప్పకపోవచ్చంటూ రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన వ్యాఖ్యలతో దేశంలో పెట్రో మోత తప్పదని తేలిపోయింది. అయితే, ఏ స్థాయిలో ధరలు పెరుగుతాయి, ఎప్పటి నుండి పెరుగుతాయి అన్న అంశంపైనే స్పష్టత రావాల్సిఉంది. నాలుగేళ్లుగా పెట్రో ధరలు పెరగలేదంటూ తాజాగా చేయబోయే పెంపునకు సమర్థనగా కేంద్రం చేస్తున్న వాదనలు ఏ మాత్రం సమర్థనీయం కాదు. పెట్రో ధరలు పెరగ్గానే అమాంతంగా అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. నిత్యావసరాలు ఆకాశాన్ని అంటుతాయి. కాబట్టి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి. పొదుపు అన్నది ప్రజాప్రతినిదుల దుబారాలను తగ్గించడంతో మొదలు కావాలి. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం పెరిగి, దాని ప్రభావం అన్ని వస్తువులపై పడటం ఖాయం. బంగారం కొనుగోళ్లను ఏడాదిపాటు నిలిపి వేయాలని ప్రధాని సూచించగా, కేంద్ర ప్రభుత్వం తాజాగా బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 నుండి 15 శాతానికి పెంచడం కూడా ప్రజలపై భారాలు మోపడం తప్ప మరోటి కాదు. ప్రజలు త్యాగాలు చేస్తే ప్రజాప్రతినిధులు ఎంజాయ్ చేయడం ఎంతవరకు సమంజసం. లక్షల్లో జీతు, భత్యాలు, ఉచిత బంగళాలు, కరెంట్ ఫ్రీ, ఫోన్లు ఫ్రీ ఎందుకో చెప్పాలి. ఇవన్నీ ప్రజలను ఉద్ధరించే చర్యలు ఎంతమాత్రం కావు. దీనికితోడు  చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఒత్తిడిలో ఉండటం, రైతాంగ ఆదాయం స్థిరంగా లేకపోవడం వంటి అంశాలు దేశ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.  ధరల నియంత్రణ చర్యలు, ఉపాధి హామీ, వ్యవసాయ, చిన్న పరిశ్రమల రక్షణపై దృష్టి పెట్టాలి. పొదుపును సీరియస్‌గా తీసుకుని ప్రజాప్రతినిధుల జీతాలు, పెన్షన్లు రద్దు చేయాలి. వారి విదేశీ ప్రయాణాలను, విమానాలను వేసుకుని ఊరేగడాన్ని, హెలకాప్టర్లు వేసుకుని ఊరూరా తిరగడాన్ని అడ్డుకోవాలి. ఇవి మాత్రమే దేశానికి మేలు చేస్తాయి. ఈ దిశగా విప్లవాత్మక చర్యలకు దిగాలి.

# ఎన్నికల సర్వే లెక్కలు ఎక్కడ తప్పాయి?



"ఎన్నికలైపోయినాక ఒక విషాదాంత ప్రహసనం ముగిసిపోయినట్టుంటుంది... దేశం పరాయివాడి పాలనలోకి వెళ్లిపోయినట్టు అనిపిస్తుంది... మనల్ని ఎవరో వెక్కిరిస్తున్నట్టు, ఎవరో మనల్ని చూసి నవ్వినట్టుంటుంది... మన మీద మనకే అసహ్యం వేస్తుంది... కొంత రోత పుడుతుంది. మన బుద్ధి గడ్డి తింటున్నదని తెలిసి సిగ్గేస్తుంది. ఎన్నికల పతాకాలు విప్పేసిన తర్వాత, గుడారాలు పీకేసిన మీదట, పట్టాభిషేక మహోత్సవం ముగిసిన తర్వాత తుపాకీ ఇంకా మనకే గురిపెట్టి వుందని తెలుస్తుంది. మన ఓటే మనల్ని కాటేసిందని తెలుస్తుంది. ఈ మొహం మరో అయిదేళ్ల వరకు ఎవరికీ చూపించలేం గదా అనిపిస్తుంది. దిగులేస్తుంది." మహానుభావుడు కెవెన్‌వై పంతంజలి నాలుగు దశాబ్దాల కింద (ఉదయం దినపత్రిక, 29.12.1984) అన్న అక్షర సత్యమైన మాటలివి. పరిస్థితిలో ఇప్పుడు పెద్దగా మార్పేమీ లేదు. అదే భావన అత్యధికుల్లో! సదరు ఎన్నికలకు ముందు కొన్ని సర్వేలు, పరిశీలనలు, అంచనాలు వస్తుంటాయి, మరి వాటి పరిస్థితేంటి? అసలు ఫలితాలు వచ్చాక ప్రతి సర్వే సంస్థ విశ్లేషించుకోవాలి! తమ అంచనాలు కరెక్టయితే అవి ఎలా వచ్చాయి? శాస్త్రీయ పద్ధతుల్ని స్థిరీకరించాలి. తప్పయితే ఎక్కడ, ఎలా లెక్క తప్పింది? సమీక్షించుకోవాలి. సర్వే సంస్థలేవైనా ప్రజల్లో విశ్వసనీయతను పెంచాలి. దేశమంతా చర్చ జరుగుతున్న సందర్భమిది!ఌశ్రీంశీ =ఖుం - నేల విడిచి సేద్యం!ఌఉజవతీఅంవవఎవత్ మరిన్ని కనుగొనండి డిజిటల్ పేపర్ ఆన్‌లైన్ వార్తలు వీడియో వార్తలు ఇటీవలి 5 రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలు దేశంలో ఉత్కంఠ రేపాయి. ప్రతి ఎన్నికలలో ఏదో ఒక ఆశ్చర్యం ఉండింది. కానీ, తాజా ఎన్నికల ఫలితాలు మరొక పార్శ్వాన్ని ఎత్తి చూపాయి. సాధారణంగా ప్రతి ఎన్నికల్లో పోలింగ్ అయిపోయినాక అనేక సంస్థలు, వ్యక్తులు వారికున్న సమాచారం, సేకరించిన జనాభిప్రాయం, రాజకీయ అవగాహనల్ని బట్టి ఎన్నికల ఫలితాలు ముందస్తుగా ఊహించి అంచనాల్ని వెల్లడిస్తారు. ఎగ్జిట్ పోల్స్‌గా చలామణీ అయ్యే ఇందులో అన్నీ 'ఎగ్జిట్ పోల్స్' కావు. వివిధ పద్ధతుల్లో జనాభిప్రాయాల్ని సేకరించడం ద్వారా పలికే ఈ భవిష్యవాణులు కూడా వేర్వేరు శాస్త్రీయ పద్ధతులు అనుసరించే చేస్తారు. అనూహ్యంగా ఇటీవలి ఎన్నికల్లో ఫలితాలను దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ పక్కాగా ఊహించడంలో గతి తప్పాయి. అంకెల్లో హెచ్చుతగ్గులు ఎప్పుడూ ఉండేవే అయినా ఈసారి మాత్రం పలు సర్వే సంస్థలు ఫలితాల దిశను తప్పడం గమనార్హం. ప్రత్యేకంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు తుది ఫలితాలు, అంతకు ముందు వచ్చిన వివిధ ఎగ్జిట్ పోల్ ఫలితాల మధ్య భారీ తేడా చూడవచ్చు. ఇది కేవలం అంకెలలో తేడాగా కొట్టి పారేయలేము. ఓటర్ల నాడిని ఎంతో కొంత, ఏదో రకంగా ముందుగానే పసిగట్టే సేఫాలజిస్తులు ఈ సారి ఘోరంగా విఫలమయ్యారు. దీనికి కారణాలు ఏమై ఉండవచ్చు? ఆసక్తి కలిగించే ఈ అంశాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరముంది. పరిమితులొౕక అద్దంకి నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్రపాలిత ప్రాంతం... మొత్తం అయిదు అసెంబ్లీలకు జరిగిన (2026) ఎన్నికల్లో కేరళ, అసోం, పుదుచ్చెరి విషయంలో సర్వే అంచనాలు తుది ఫలితాలతో చాలావరకు సరిపోలాయి. ఎటొచ్చీ పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎగ్జిట్ పోల్స్, తుది ఫలితాలను కచ్చితంగా అంచనా వేయడంలో విఫలమయ్యాయి. సర్వే పద్ధతిపరమైన పరిమితులూ కారణం కావచ్చు. గతంలో నిరాసక్తంగా ఉన్న పౌరులను పోలింగ్ బూత్‌లకు తీసుకువచ్చింది. 'సర్' తొలగింపుతోపాటు, జరుగుతున్న 'తొలగింపు'ల భయం కారణంగా ఎక్కడెక్కడో ఉన్నవారినీ పరుగెత్తుకు వచ్చి ఓటు వేసేలా చేసింది. ఎన్నికలకు ముందు అభిప్రాయ సేకరణ నమూనాలలో వీరికి ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉండదు, ఉన్నా తక్కువ. సర్వే సంస్థ నమూనాల్లో ఉండి, సుప్రీంకోర్టు ఇచ్చే తీ(ఓదా)ర్పు ద్వారానైనా తాము ఓటేస్తామనుకున్న సుమారు 27లక్షల మందికి ఓటింగ్ చాన్స్ రాలేదు.అంచనాలుతుది ఫలితాల మధ్య వ్యత్యాసానికి ఇదీ కారణమై ఉంటుంది. ఓటర్లు, ఒపీనియన్ మేకర్స్ వేర్వేరు తమిళనాడులో మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ డిఎంకె నేతృత్వంలోని కూటమి ఆధిక్యతను ఊహించి, సీట్ల సంఖ్య అతిగా అంచనా వేసి, కొత్తగా రంగప్రవేశం చేసిన టివికె (తలపతి విజయ్ పార్టీ) ప్రభావాన్ని తక్కువగా లెక్కగట్టాయి. ఎక్కువ సంఖ్యలో ఉండే ప్రత్యక్ష ఓటర్ల కన్నా, ముఖ్యంగా యువమహిళా ఓటర్ల కన్నా పరిమితంగా ఉండే 'ఒపీనియన్ మేకర్స్' అభిప్రాయమే (నమూనా నిష్పత్తి వల్ల) సర్వేల్లో ప్రతిబింబించి ఉండొచ్చు! విజయ్‌ను తక్కువ అంచనా వేయడానికి...స్వాభావిక ఆలోచనలు, రాష్ట్రంలో ఆరు దశాబ్దాలుగా కొత్త పార్టీలకు దొరకని అవకాశాలు, సినీ నటులు రాజకీయాల్లోకి వచ్చినా ఇటీవల పెద్దగా ప్రభావం చూపకపోవడం వంటివి కారణాలు కావొచ్చు. 'కరూర్' తొక్కిసలాట, 41 మంది మృతి తర్వాత ర్యాలీలు, సభల్ని విజయ్ తగ్గించడం, విజయ్ సభలకు వచ్చిన జనం మీద మీడియాలో తగిన విశ్లేషణలు లేకపోవడం, ఎపిలో 'పవన్ కళ్యాణ్' తరహా అభిమానంగా కొట్టిపారేయడం... వంటివీ అంచనాలు తప్పడానికి కారణం కావచ్చు. ఓటు వాటా శాతాలను బట్టి విజయ మార్జిన్‌లను అతిగా లెక్క వేసి, సీట్ల సంఖ్య తక్కువగా పరిగణించడం పొరపాటుకు తావిచ్చింది. తమిళనాట ఎగ్జిట్ పోల్స్, గెలిచే కూటమికి పెద్ద మార్జిన్‌ను అంచనా వేస్తుంటాయి. 2021లో, అవి డిఎంకె 175- 195 సీట్లు గెలుస్తుందని అంచనా వేయగా, వాస్తవ సంఖ్య 159 మాత్రమే! 2026లో కూడా, ఇలాంటి అతి ఆశావాదమే బోల్తా కొట్టి ఉంటుంది. ద్రవిడ ఉద్యమ ప్రభావం సన్నగిల్లడం రెండు సంప్రదాయ ద్రవిడ పార్టీలు డిఎంకె, అన్నాడిఎంకె లను కాదని, విజయ్ వైపు ఓటర్ల నిశ్శబ్ద మొగ్గుకు కారణమై ఉండొచ్చు. ఎక్కువ చోట్ల గట్టి ముక్కోణపు పోటీల వల్ల విజేతల మార్జిన్‌లు తగ్గటం, వీటివల్లే సర్వే అంచనాలు తారుమారుకు ఆస్కారం ఏర్పడింది. తమిళనాడైనా, బెంగాలైనా... ఓడిపోతోందనో, వివాదాస్పదమనో భావించే పార్టీకి బహిరంగ మద్దతుకు ఓటర్లు వెనుకాడవచ్చు. భయం, సిగ్గు వంటి కారణాల వల్ల ఓటరు స్పందనలో నిజాయితీ తగ్గింది. ఓటింగ్ జరిగిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ నిర్వహణకు ఒకప్పటిలా సానుకూలత లేని సంక్లిష్టత ఇప్పుడు నెలకొంది. ముందే జనాభిప్రాయం తీసుకొని, దానికి 'ఎగ్జిట్ పోల్' అని పేరు తగిలిస్తున్నారు. ఓటర్ల నిర్ణయాల్లో చివరి నిమిషపు మార్పుల్ని, ఆఖరు నిమిషంలో జరిగే ప్రచార ప్రలోభ కార్యక్రమాల ప్రభావాన్ని అప్పుడివి గుర్తించలేవు. పుట్టగొడుగుల్లా సర్వే సంస్థలు సర్వేల్లో ఏ పద్ధతులు అనుసరిస్తున్నారు? నమూనా పరిమాణం ఎంత? సర్వే ఎక్కడ? ఎప్పుడు (ఏయే తేదీల మధ్య) నిర్వహించారు? ఆర్థిక వనరులెక్కడివి? అన్నీ పారదర్శకంగా ఉండాలనే డిమాండ్ వస్తోంది. ఇవన్నీ ముందుగానే ఆన్‌లైన్‌లో ప్రకటించాలి. అప్పుడు బోగస్ సర్వే సంస్థలు, వ్యాపార దృక్పథంతో ఉన్నవి, స్వతంత్ర్యమనే ముసుగులో రాజకీయ పార్టీలకు అనుకూలంగా/ ప్రతికూలంగా పనిచేస్తున్నవీ అన్నీ ఎగిరిపోతాయి. ఈ ఆరోగ్యకర చర్చను లేవనెత్తడంతోపాటు దేశంలో ఎగ్జిట్ పోలింగ్‌తో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను ఈ రెండు రాష్ట్రాల ఎన్నిక ఫలితాలు ఎత్తి చూపాయి. నమూనా పరిమాణం ఎకువుంటే ఖచ్చితత్వం అనే వాదనా తప్పే! ఓటర్లలో ఉన్న వైవిధ్యం సంక్లిష్టం. పెద్ద నమూనా పరిమాణాలతో తీసుకున్నా కూడా నిర్దిష్ట వర్గాల (పశ్చిమ బెంగాల్‌లోని మతువా వర్గం లేదా తమిళనాడులోని నిర్దిష్ట కుల సంబంధాలు వంటివి) సూక్ష్మభేదాలను పట్టుకోవడం కష్టం. ఒక మెగా నగరంలోని సంక్లిష్టత ఇక్కడ కూడా ప్రతిబింబించింది. ఇటీవల ముంబై మునిసిపల్ ఎన్నికలలో శివసేన భారీ స్థాయిలో ఓడిపోవడం, ఎవరికీ అంచనాలు లేకపోవడం ఒక ఉదాహరణ. వెరసి, ఎగ్జిట్ పోల్ శాస్త్రీయ పద్ధతులు "వైఫల్యం" అనే భావనకు దారితీసింది. మరి, ఎగ్జిట్ పోల్ శాస్త్రీయ పద్ధతుల మీద చర్చ చేద్దామా? కొత్త పద్ధతుల మీద పరిశోధనకు ఈ వైఫల్యం ఒక దిక్సూచిగా మారవచ్చు.

# చంద్రబాబు బాటలో ఎపి మంత్రులు

### కాన్వాయ్‌లో కార్లు తగ్గించుకున్న అమాత్యులు

అమరావతి : అంతర్జాతీయ చమురు సంక్షోభం నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పిన పొదుపు సూత్రాలను ఏపీ మంత్రులు పాటిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ తరహాలోనే మంత్రులు కాన్వాయ్‌ను కుదించుకుంటున్నారు. ఈరోజు(గురువారం) ఉదయం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్ అల్పాహార విందును ఏర్పాటు చేశారు. ఈ విందుకు రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు ఎస్కార్ట్ వాహనం లేకుండా విందుకు వచ్చారు. అలాగే మంత్రులు అనిత, గుమ్మడి సంధ్యారాణి, సవిత, కొల్లు రవీంద్ర, పార్థసారథి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, పయ్యావుల కేశవ్ తదితరులు.. ఎస్కార్ట్ కాకుండా ఒక్కో వాహనంలోనే సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చారు. మంత్రి నారాయణ కూడా కాన్వాయ్‌ను కుదించుకున్నారు. గతంలో మంత్రి నారాయణ కారుతో పాటు కాన్వాయ్‌లో మరో నాలుగు వాహనాలు ఉండేవి. ప్రస్తుతం వాహన శ్రేణిలోని రెండు వాహనాలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. నేటి నుంచి మంత్రి నారాయణ కాన్వాయ్ 50 శాతం తగ్గగా.. కేవలం రెండు వాహనాలతోనే సీఎం క్యాంపు ఆఫీసుకు మంత్రి చేరుకున్నారు. సీఎం చంద్రబాబు వాహనశ్రేణిని తొమ్మిది వాహనాల నుంచి నాలుగుకు కుదించారు. సీఎం వాహనాలు 50 శాతం కుదించడంతో ఆయన భద్రత చూసే ఎన్‌ఎస్‌జీ కోసం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఇకపై ఎన్‌ఎస్‌జీ సెక్యూరిటీ.. సీఎం కాన్వాయ్‌లో బస్సులోనే వెనుక వెళ్లనుంది. మంత్రి నారా లోకేశ్ కాన్వాయ్ సగానికి కుదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సీఆర్‌పీఎఫ్ భద్రత ఉండటంతో లోకేశ్ కాన్వాయ్‌లో మొత్తం నాలుగు వాహనాలు ఉండగా... వాహనాలు కుదించడంతో ఇక కాన్వాయ్‌లో రెండు వాహనాలు ఉండనున్నాయి. దీన్ని నేటి నుంచే అమలు చేయాలని నిర్ణయించారు.

# ఉమ్మడి పీజీ ప్రవేశపరీక్ష షెడ్యూల్

### నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్,మే14(ఆర్ఎన్ఎ): ఉమ్మడి పీజీ ప్రవేశపరీక్ష (సీపీగెట్)కు ఈ నెల 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 7 విశ్వవిద్యాలయాలతోపాటు జేఎన్‌టీయూహెచ్, కొత్తగూడెం ఎర్త్‌సైన్సెస్ వర్సిటీల్లో పీజీ సైన్స్ కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహించనున్న సీపీగెట్ షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి  ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, వర్సిటీల వైస్ ఛాన్సలర్లు(వీసీలు), కన్వీనర్ తదితరులు విడుదల చేశారు. తొలిసారి సీపీగెట్‌ను తమ వర్సిటీ నిర్వహిస్తోందని కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈసారి ఇంటర్ విద్యార్హతతో ప్రవేశాలు పొందే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సీట్ల భర్తీ సీపీగెట్ ద్వారా ఉండదని, వాటిని దోస్త్‌లో చేర్చినట్లు తెలిపారు. కన్వీనర్ ఆచార్య రాజేందర్ మాట్లాడుతూ మొత్తం 45 స్జబెక్టులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆలస్య రుసుం లేకుండా జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.2 వేల ఆలస్య రుసుంతో 18 వరకు అవకాశం ఉంటుంది. జులై తొలివారంలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆగస్టు మొదటివారంలో తరగతుల ప్రారంభం. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టుల భర్తీకి మార్గదర్శకాలతో 2025 ఏప్రిల్‌లో ప్రభుత్వం జీవో జారీచేసినా.. ఇంకా ఏ వర్సిటీ ఎన్ని ఖాళీలను భర్తీ చేసుకోవా లన్నది స్పష్టత ఇవ్వలేదని ప్రతాప్‌రెడ్డి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

# నదీమతల్లికి వందనం

గోదావరి నదీ తీరంలో ఓ ఆధ్యాత్మిక గురువు ఆశ్రమాన్ని నిర్వహించేవాడు. అతడు తన శిష్యులతో గోదావరి జన్మస్థానమైన త్రయంబకం క్షేత్రానికి ఏటా వెళ్లేవాడు. అక్కడ బొట్టు బొట్టుగా మొదలై.. గంభీరమైన నదిగా అవతరించే గోదావరికి ప్రత్యేక పూజలు చేసేవాడు. ఓ ఏడాది ఆశ్రమ బృందం త్రయంబకేశ్వర్ బయల్దేరుతున్నది. ఇంతలో ఆశ్రమం పక్కనే ఉన్న గ్రామానికి చెందిన యువకులు కొందరు వచ్చారు. తాము కూడా యాత్రకు వస్తామని కోరారు. అందరినీ నదిలో స్నానం చేసి రమ్మన్నాడు గురువు. అందరూ సంతోషంగా నదిలో స్నానం చేసి ఒడ్డుకు చేరారు. గురువు మాత్రం వారిలో కొందరినే ఎంపిక చేసి తనతో యాత్రకు రమ్మని చెప్పాడు. ఎంపిక కానివారు.. 'మీతో రావడానికి మాకు ఎందుకు అర్హత లేదు' అని గురువును అడిగారు. అప్పుడు గురువు.. 'మన సంస్కృతిలో నదులను పవిత్రంగా భావిస్తాం. మన నాగరికత మొత్తం నదుల ఒడ్డునే అభివృద్ధి చెందింది. నీరు లేకపోతే జీవితమే లేదు. అలాంటి నదుల్ని మనం జాగ్రత్తగా కాపాడుకోకపోతే మానవ మనుగడే ఉండదు. ప్రాచీన కాలంలో నగరాలన్నీ నదీ తీరంలోనే నిర్మితమయ్యాయి. మన దేశంలో రుషులు, మునులు.. నదీ తీరంలోనే తపస్సు చేసుకునేవారు. అలాంటి నదులను మనం పవిత్ర భావనతో గౌరవించి అవి కలుషితం కాకుండా కాపాడుకోవాలి. ఇందాక స్నానం ఆచరించే సమయంలో నదులపై మీ వైఖరి ఏంటో స్పష్టమైంది' అన్నాడు గురువు. 'మేం చేసిన నేరం ఏమిటి?' అని మళ్లీ అడిగారు యువకులు. అప్పుడు గురువు 'నేను చెప్పిందే తడవుగా మీరంతా నేరుగా నదిలోకి దిగారు. యాత్రకు ఎంపికైన వారు నదిలో అడుగు పెట్టడానికి ముందు.. ఆ గోదావరి తల్లికి నమస్కరించారు. ఆ పవిత్ర జలాలను దోసిట తీసుకొని తలపై చల్లుకున్నారు. ఆ తర్వాతే నదిలో పాదం మోపారు. అంటే వాళ్లు నదిని పవిత్రంగా భావించారు. తల్లిగా గౌరవించారు. అందుకే వారిని యాత్రకు నాతోపాటు రావడానికి ఆమోదించాను. నదులను గౌరవించడం అలవర్చుకున్న తర్వాత మిమ్మల్నీ తీసుకెళ్తాను' అని వివరించాడు.



ఆధ్యాత్మికం

# ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**రోగులు, వారి బంధువులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి**

**రేడియాలజీ, ఆప్టమాలజీ, డెంటల్ సేవలను మరింత మెరుగుపర్చాలి**

**ఐడీఓసీలో జిల్లా ఆసుపత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా ఆసుపత్రికి సంబంధించిన అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి ప్రజలకు మంచి వైద్య సేవలు అందిస్తూ విశ్వాసాన్ని సంపాదించుకుందని తెలిపారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలను అభినందించారు. నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది కూడా రోగులు, వారి కుటుంబ సభ్యులతో సౌమ్యంగా, మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. రోగులతో వ్యవహరించే విధానంపై నర్సులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఆసుపత్రిలో రేడియాలజీ, ఆప్టమాలజీ, డెంటల్ ఓపి సేవలను మరింత మెరుగుపర్చాలని సూచించారు. రోగుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ ఫిజియోథెరపీ సేవల నాణ్యత ఏమాత్రం తగ్గకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని నిరంతరం శుభ్రంగా ఉంచాలని, రోగుల రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. అవసరమైతే అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని సూచించారు.రోగులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శ్రీపాద కప్ విజేత ఎంకే రైడర్స్

**-50వేల రూపాయలు అందజేసిన శీను బాబు**




రామగిరి,మే 13(ది క్రైమ్ న్యూస్):- .కమాన్ పూర్ మండల కేంద్రంలో జరిగిన శ్రీపాదరావు స్మారక కేపీఎల్ క్రికెట్ పోటీల్లో ఎం.కె రైడర్స్ విజేతగా నిలిచి 50 వేల రూపాయలతో పాటు ట్రోఫీని అందుకుంది. గత 15 రోజులుగా జరుగుతున్న కమాన్ పూర్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ లో జిపిఎల్ లెజెండ్స్, ఎంకే రైడర్స్ క్రికెట్ జట్లు పోటీపడ్డాయి. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోదరుడు శీను బాబు టాస్ వేయగా ఎంకే రైడర్స్ టాస్ గెలుపొంది బౌలింగ్ సాధించింది. దీంతో ముందుగా బ్యాటింగ్ చేసిన జిపిఎల్ లెజెండ్స్ ఆ పది ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. ఇందులో మట్ట రమేష్ 28 పరుగులు, అరుణ్ 11 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ దిగిన ఎంకే రైడర్స్ 5 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 73 పరుగులు చేసింది. ఇందులో ముఫీద్ కేవలం 17 బంతుల్లో ఐదు భారీ భారీ సిక్సర్లు, నాలుగు ఫోర్ లతో 51 పరుగులు చేశారు. ఇమ్రాన్ షేక్ 17 పరుగులు చేశారు. రాఖీ నాలుగు పరుగులు చేశారు. దీంతో 9 వికెట్లతో ఎంకే రైడర్స్ విజయం సాధించింది. ఐదు సిక్సర్లు కొట్టిన ముఫీద్ కు మాజీ ఎంపీటీసీ పిల్లి శేఖర్ 2500 అందజేశారు. విజేతలకు ట్రోఫీతో పాటు 50వేల నగదును మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కిచ్చన్న, లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీను బాబు, ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్, శ్రీ ఆది వరహస్వామి చైర్మన్ ముస్త్యాల దామోదర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇనగంటి రామారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావుఎంకే రైడర్స్ ఫ్రాన్చేసి మెహరాజ్ ఖాన్, జిపిఎల్ రైడర్స్ బ్రాంచెస్ పీట్ల గోపాల్, సర్పంచులు రంగు సత్యనారాయణ గౌడ్, పొన్నగంటి కుమార్, షీలారపు మల్లయ్య,అంబిరిశ్రీనివాస్ పటేల్, రెబల్ రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.

**నూతన కమిటీ సభ్యులకు ఘన సన్మానం.**

**ఐక్యతకు నిదర్శన గా కొలనూరు ఆర్యవైశ్య సంఘం.**



పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరు గ్రామంలో ఆర్యవైశ్య సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు అల్లెంకి శేషమూర్తి మరియు యూత్ మండల అధ్యక్షుడు పుల్లూరి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొలనూరు గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఉప్పల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా యంసాని హనుమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇల్లెందుల శ్రీధర్, కోశాధికారిగా రావికంటి ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా గర్రెపెల్లి శ్రీనివాస్, ముస్త్యాల భాస్కర్‌లను నియమించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామానికి విచ్చేసిన సంఘం మండల అధ్యక్షుడు అల్లెంకి శేషమూర్తి మరియు యూత్ మండల అధ్యక్షుడు పుల్లూరి పృథ్వీరాజ్‌లను కొలనూరు గ్రామ ఆర్యవైశ్య సంఘ సభ్యులు ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆర్యవైశ్య సంఘ సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

## డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే డబుల్ సార్లు నీట్ పేపర్ లీకులేనా

**22 లక్షల మంది విద్యార్థులు, కోట్లాది కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం**

**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**



కరీంనగర్ టౌన్,మే13(ది క్రైమ్ న్యూస్) : గత మూడు సంవత్సరాల్లో రెండోసారి నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారం వెలుగులోకి రావడం దేశ విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలిచాల రాజేందర్ రావు విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.బుధవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో కష్టపడి రాసి నీట్ పరీక్షలో మళ్లీ పేపర్ లీక్ ఘటన చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. “డబుల్ ఇంజిన్ సర్కార్” అంటూ గొప్పలు చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం, దేశ యువత భవిష్యత్తును కాపాడడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత మూడు సంవత్సరాల్లో ఇది రెండోసారి నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారం బయటపడడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సుమారు 22 లక్షల మంది విద్యార్థులు, కోట్లాది కుటుంబాలు భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం ఎలా సమర్థించు కుంటుందని ప్రశ్నించారు. విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవు తుంటే, పరీక్షా నిర్వహణలో భద్రతా లోపాలు, అవినీతి, నిర్లక్ష్యం కారణంగా వారి ఆశలు దెబ్బతింటు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అత్యంత కీలకమైన ప్రవేశ పరీక్షలను కూడా పారదర్శకంగా నిర్వహించలేని పరిస్థితికి రావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న వారికి ప్రజలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని వెలిచాల రాజేందర్ రావు డిమాండ్ చేశారు. దేశ యువత నమ్మకాన్ని కోల్పోయిన ప్రభుత్వం అధికారం లో కొనసాగడానికి అర్హత లేదన్నారు.

## సీబీఎస్ఇ 12వ తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల జయకేతనం




కరీంనగర్ టౌన్, మే13(ది క్రైమ్ న్యూస్) : చక్కటి ప్రణాళికల ద్వారా సరైన పద్ధతిలో సమీక్ష నిర్వహణ ద్వారా విద్యార్థులచే విజయాలను సులభంగా సాదింప చేయవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో అల్ఫోర్స్ సీబీఎస్ఈ సీనియర్ సెకండరీ పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు నేడు ప్రకటించిన 12వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల నిర్వహించినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలు పాటించడమే కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినటువంటి అధ్యాపకులచే బోధన అందిస్తూ అగ్రగామిగా నిలుపుతున్నామని వారు సంతోషం వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లో పై చేయి సాధించడం మరియు ఇప్పటివరకు ప్రకటించినటువంటి అన్ని రకాల పరీక్షల ఫలితాల్లో స్ఫూర్తిదాయకమైన మార్పులతో ఆదర్శంగా నిలిచినదని సంతోషం వ్యక్తం చేశారు.7గురు విద్యార్థులు 460 పైగా సాధించారని మరియు 47 మంది విద్యార్థులు 400 మార్కులు పైగా సాధించడం చాలా గొప్ప విషయమని చెప్పారు.పిసీఎం విభాగం: వి. శ్రేయాస్ రెడ్డి,475 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిల్చాడని, జి.చైత్ర 471 మార్కులు, ఎన్.రత్నప్రకాష్ 469 మార్కులు, బి.లిఖిత్ సాయి 461 మార్కులు, కే. ఐశ్వర్య 458 మార్కులు, హర్షఫ్ అర్మాన్ 456 మార్కులు, వి.సాయి హర్షిత్ 456 మార్కులు, బి రోహిత్ 455 మార్కులు, ఎన్.కావ్య, జె.సరయు 450 మార్కులు తదితరులు మంచి మార్కులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. పిసిబి విభాగం:డి.రుత్విక్, 476 మార్కులు తో పాఠశాలలో ప్రథమస్థానంలో నిలిచాడని, పి.శృత్విక 472 మార్కులు, డి.శ్రేయన్ష్ 462 మార్కులు మరియు తదితరులు అత్యుత్తమ మార్కులు సాధించారని చెప్పారు.అధ్యాపకుల యొక్క నిరంతర కృషితో, తల్లిదండ్రుల యొక్క అమూల్యమైనటువంటి సహకారంతో ఈ అద్భుతమైన ఫలితాలు సాధ్యమవుతున్నాయని చెప్పారు.గత 36 సంవత్సరాలుగా అల్ఫోర్స్ విద్యాసంస్థలు చాలా చక్కటి కార్యక్రమాలతో మరియు ప్రపంచ ప్రమాణాలను పాటింపచేస్తూ భారతదేశంలో గుర్తింపు పొందిన బోధనా సిబ్బందితో బోధిస్తూ అగ్రగామిగా ఉంటున్నామని వారు చెప్పారు.చాలా చక్కటి ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్చాలను, స్కోర్ కార్డ్స్ అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో అంబలి పంపిణి

**- ముఖ్య అతిథిగా దుద్దిళ్ల శ్రీను బాబు**

మంథని ది క్రైమ్ న్యూస్ మే 13: కమాన్‌పూర్ మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంబలి పంపిణి కార్యక్రమం ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. తీవ్ర ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు చల్లని అంబలి అందిస్తూ యువసేన సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండుతున్న ఎండల్లో పేదలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు యువత ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. యువత సమాజ సేవలో ఎప్పుడూ ముందుండాలని సూచించారు. బుధవారం అంబలి పంపిణిని కీ.శే. మాదాసు రాధమ్మ--రాజయ్య జ్ఞాపకార్థంగా మాదాసు మహేష్ నిర్వహించారు. ప్రజలకు చల్లని అంబలి పంపిణి చేయడం గొప్ప సేవాభావానికి నిదర్శనమని యువసేన సభ్యులు పేర్కొన్నారు. మాదాసు మహేష్ మరియు వారి కుటుంబ సభ్యులకు ఛత్రపతి శివాజీ యువసేన తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో యువసేన సభ్యులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## అవగాహన లేకుండా నాటడం..... ఆరోపణలు విద్యుత్ శాఖకు



మానకొండూర్, మే13(ది క్రైమ్ న్యూస్):కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని గ్రామాల్లో హరితహరంలో భాగంగా చెట్లు నాటించడంలో అవగాహన లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు. ఉపాది హామీకి అనుసంధానం చేస్తూ చేపట్టిన హరితహరంలో ఎటువంటి ముందస్తు అలోచన చేయకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు తీగల కింద మొక్కలు నాటించారంటూ గ్రామస్తులు ఆరోపించారు.రోడ్డుకు ఇరువైపులా చెట్లు నాటె విషయంలో సరిగ్గా విద్యుత్ లైన్ల కింద ఓ మొక్క పక్కనే మరో మొక్కనాటిస్తుండంతో అవి పెరిగి వృక్షాలుగా మారితే వర్షాకాలంలో తీగలకు తగిలి ప్రమాదాలు సంభవించి విద్యుత్ అంతరాయలేర్పడే అవకాశాలు లేకపోలేదంటున్నారు స్థానికులు. అస్తమానం విద్యుత్ శాఖ నిర్లక్ష్యమంటూ ఆరోపణలతో తమను ఇబ్బందులకు గురిచేసే ప్రజలు తీగల కిందనే మొక్కలపై ఎందుకు మాట్లాడడం లేదంటూ విద్యుత్ సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండగా, 15-20 అడుగుల కంటే ఎత్తైన చెట్లను తీగల కింద పెంచకుండా విద్యుత్ శాఖ సూచనలు తీసుకుని లైనుకు దూరంగా చెట్లను నాటించాలని గ్రామస్తులు అధికారులకు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## సెన్సార్ బోర్డు సభ్యుడిగా రాపాక ప్రవీణ్



మానకొండూర్, మే13(ది క్రైమ్ న్యూస్) : కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ కు చెందిన బిజెపి నాయకుడు, ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్ ను కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడిగా నియమిస్తూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ రీజినల్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ గొలికర్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్,ఎంపి బోయినపల్లి ప్రవీణ్ రావు,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగోండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణా రెడ్డి,ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి, గుర్రాల వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాడ వెంకట రెడ్డి, మండలాధ్యక్షుడు కంది రాజిరెడ్డిలకు రాపాక ప్రవీణ్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



మానకొండూర్, మే13(ది క్రైమ్ న్యూస్):కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పోచంపల్లిలోని ఆదర్శ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకై బుధవారం నుండి ఆన్లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ పద్మశ్రీ ప్రకటనలో తెలిపారు. ఎంపీసి,బైపీసీ, సిఈసి,ఏసిఈల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తుండగా, ప్రతి కోర్సులో 40 మంది విద్యార్థులకు ప్రవేశం ఉంటుందిని ఈ నెల 25 లోగా https://tgms.telangana.gov.in/tgms ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రకటన ద్వారా సూచించారు తెలిపారు.

## భీమా నగదు అందించిన బీఓబీ బ్యాంకు



తిమ్మాపూర్, మే13(ది క్రైమ్ న్యూస్):కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామక్రిష్ణకాలనీకి చెందిన పంచాయతీ సిబ్బంది దుర్సెట్టి ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.ఐలయ్య నుస్తులాపూర్ లోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకం క్రింద భీమా చేయించుకోగా బ్యాంకు మేనేజర్ ఏ.బాలరాజు 2లక్షల నగదును ఎల్లయ్య భార్య కనకవ్వకు అందించారు.18-50ఏళ్ల వయస్సున్న వారెవరైనా తమ బ్యాంకు ఖాతాపై భీమా చేయించుకుంటే, ప్రతీ ఏటా మే నెలలో ఆటోమాటిక్ డెబిట్ రూపంలో కొంత డబ్బు కట్టి భీమా వర్తిస్తుందని, ప్రతీ ఖాతాదారుడు భీమా చేయించుకోవాలని సూచించారు.బ్యాంకు సిబ్బంది సాయిరాం, కుమారస్వామి, వసుందర, ఇందుజ,అనూష తదితరులు భీమా నగదు అందజేసిన వారిలో ఉన్నారు.

## హాలియాలో ఘనంగా శ్రీ సీతారామచంద్రస్వామి సామ్రాజ్య పట్టాభిషేకం

### ముఖ్య అతిథిగా విచ్చేసిన చిన్న జీయర్ స్వామి



నల్గొండ జిల్లా ప్రతినిధి : ది క్రైమ్ న్యూస్ : 13.05.2026 హాలియా మున్సిపాలిటీలో శ్రీ సీతారామచంద్రస్వామి సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమం సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామివారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి గారు, హాలియా మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్ గారు, హాలియా ఎస్సై బి. సాయి ప్రశాంత్ గారు, ఆలయ జనరల్ సెక్రటరీ వర్కాల సుధాకర్ రెడ్డి గారు, హాలియా మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పుర ప్రముఖులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా తుమ్మల 40వ వసంతాల వేడుకలు వేడుక

### మంత్రి తుమ్మల సేవల మరువలేనివి




మధిర ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి మే 13:లి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు రాజకీయ ప్రస్థానం ప్రారంభించి 40 వసంతాలు పూర్తయిన సందర్భంగా మధిర రిక్వెస్ట్ క్లబ్ హాల్లో బుధవారం నాడు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మొండితోక సుధాకర్ , చేకూరి నాగార్జున ఆధ్వర్యంలో తుమ్మల అభిమాన సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మంత్రి రాజకీయ ప్రయాణాన్ని స్మరించుకున్నారు. ప్రజా సేవలో నాలుగు దశాబ్దాలుగా తుమ్మల అందించిన సేవలను కొనియాడుతూ నాయకులు ప్రసంగించారు. అలాగే మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు చేపట్టిన అభివృద్ధి పనులు, నియోజకవర్గంలో జరిగిన మార్పులు, వివిధ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ఫోటో ప్రదర్శనను పార్టీ నాయకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన కార్యక్రమానికి వచ్చిన ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సూరంశెట్టి కిషోర్, టిడిపి రాష్ట్ర నాయకులు, డా, వాసిరెడ్డి రామనాథం, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పారుపల్లి విజయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి నరసింహారావు, డిసిసి మాజీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరావు, పుతుంబాక, కృష్ణ ప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చావా రామకృష్ణ, ఐలూరి వెంకటేశ్వర్ రెడ్డి, అద్దంకి రవికుమార్ తుమ్మల అభిమానులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భార్య మృతి తట్టుకోలేక మనస్థాపంతో భర్త

### ఉరివేసుకొని ఆత్మహత్య



రామగిరి, మే 13(ది క్రైమ్ న్యూస్):-రామగిరి మండలం పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని శివరాం నగర్ కు చెందిన మైలారం చంద్రయ్య( 68) సంవత్సరాలు అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు భార్య మృతి తట్టుకోలేక బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు మృతుడు సింగరేణి ఓ సి పి- టు లో ఉద్యోగం చేసి ఎనిమిది సంవత్సరాల క్రితం రిటైర్డ్ అయి ఇంటి వద్ద ఉంటున్నాడు. మృతునికి ఇద్దరు కుమారులు ముగ్గురు కుమార్తెలు కాగా వారు వేరువేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. ఇటీవల భార్య లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మృతి తట్టుకోలేక మనస్థాపంతో బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు మృతుని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామగిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గడ్డివాము దగ్ధం

### ఫైర్ ఇంజన్ రాకతో తప్పిన పెను ప్రమాదం



రామగిరి, మే 13(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన రైతు ఉడుత లచ్చయ్య గడ్డివాము బుధవారం మంటలు వ్యాప్తి చెంది పూర్తిగా దగ్ధమైంది. రైతు లచ్చయ్య రెండు ఎకరాల గడ్డి పశువుల కోసం తన ఇంటి సమీపంలో నిల్వ ఉంచాడు. అనుకోకుండా గడ్డివాముకు మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి ఫైర్ ఇంజన్ సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ సహాయంతో గడ్డివాము చుట్టుపక్కల మంటలు వ్యాప్తి చెందకుండా ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే మంటలు గడ్డి వాముకు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. తన పశువుల కోసం తెచ్చుకున్న గడ్డివాము దగ్ధం కావడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. ప్రభుత్వ పరంగా బాధిత రైతును ఆదుకోవాలని స్థానిక నాయకులు గ్రామస్తులు కోరుతున్నారు.

# ముంపు ఏరియాలో పండిన వరిపంటను కొనుగోలు చేయండి

### తహసీల్దార్‌ను కలిసిన భాధిత రైతులు



కరీంనగర్ టౌన్, మే13(ది క్రైమ్ న్యూస్) : ముంపు కు గురై ఎఫ్ టి ఎల్ కు దూరంగా ఖాళీగా ఉన్నటువంటి భూములలో ఒక సీజన్ వ్యవసాయం చేసుకుంటూ పండించిన వరి పంట ను అధికారులు కొనుగోలు చేసేలా సహకరించాలని రామక్రిష్ణకాలనీ గ్రామ భాధిత రైతులు బుధవారం మండల తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి ని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎల్ఎండి రిజర్వాయర్ పరిధిలో ముంపుకు గురైన వారి స్వంత భూములలో సుమారు 70 మందికి పైగా గత 25 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ తద్వారా వచ్చిన పంటలను అమ్ముకుంటూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని,ఇలా పండించిన వరి ధాన్యాన్ని స్థానిక కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయడం లేదని వారి వెంట వచ్చిన బీజేపీ నాయకులు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి తహసీల్దార్ కు వివరించారు.వ్యవసాయం తప్ప వేరే పనులు అలవాటు లేని సదరు రైతులు ఇలాంటి భూములలో పండిస్తున్న పంటలను మానవతా దృక్పథం తో ఆలోచించి కొనుగోలు చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో ఇటువంటి సమస్యలు ఎదురైనప్పుడు రైతు ద్వారా ధ్రువీకరించిన పత్రంనకు వ్యవసాయ అధికారి ద్వారా అనుమతి తీసుకొన్న తర్వాత కొనుగోలు చేశారని అదే విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి కొనుగోలు చేసేలా సహకరించాలని రైతులు గోనెల భూమయ్య, గంగు రాజమల్లు,కోతి మల్లేశం, ఆవుల లచ్చయ్య,గంగు తిరుపతి,అట్ల అంజయ్య తదితరులు తహసీల్దార్ ను కోరారు.వారి వెంట బీజేపీ నాయకులు గడ్డం అరుణ్, కోతి రాజు ఉన్నారు.ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కారం చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం

### - ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్.



ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) : నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక గత పది సంవత్సరాల్లో 89 రకాల పరీక్ష పేపర్లు లీక్ అవ్వడం ప్రపంచ చరిత్రలోనే ఆశ్చర్యకర విషయమని భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన నాటి నుండి ఇటువంటి చేతకాని ప్రధానమంత్రిని భారతదేశం ఎప్పుడు చూడలేదని యువజన కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ అన్నారు. 22 లక్షల మంది విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం వ్రాసుకున్న నీట్ పరీక్ష పత్రం లీక్ అవ్వడాన్ని నిరసిస్తూ, కేంద్ర ప్రభుత్వ చేతకానితనం వల్లనే దేశంలో ఇటువంటి పరిణామాలు జరుగుతున్నాయని, తక్షణం ప్రధానమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం లోని స్థానిక జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం కూడలి వద్ద ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం లో స్టేట్ సెక్రటరీ అంజనీ, యాసిన్, బెజ్జం బాల గంగాధర్, నెల్లూరి ఉపేందర్, కొండూరి హృదయ్ కిరణ్, బెల్లం సాయి తేజ, అంబటి ఈశ్వర్, రాజేష్, సన్నీ, యడ్లపల్లి తరుణ్, యశ్వంత్, ఖాదర్ బాబా, చల్లగొండ్ల సాయి తేజ, మల్లెల గాంధీ, సంపత్ మరియు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటియుసితో జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు



ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్ ): హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గుర్తింపు సంఘం ఎఐటియుసి సింగరేణి నాయకులతో డైరెక్టర్ - పా గౌతమ్ పొట్రు, ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్మికుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమావేశంలో గుర్తింపు సంఘం నాయకులు కార్మికులకు సంబంధించిన అనేక పెండింగ్ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా, యాజమాన్యం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. మెడికల్ బోర్డును ఒక నెలలోపు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు,అదేవిధంగా సొంత ఇంటి పథకంపై వచ్చే స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించి అమలు విధానాలు ఖరారు చేస్తామని తెలిపారు,మరియు పెర్క్స్ పై ట్యాక్స్ సమస్యను వచ్చే స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించి అమలు చేస్తామని.శ్రీ,కార్మికులు క్వార్టర్లు ఖాళీ చేసిన వెంటనే క్వార్టర్ వెకేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తామని,అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న 337 మందికి పైగా డిపెండెంట్‌లకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు,గనులపై డిపెండెంట్ ఉద్యోగాల దరఖాస్తులను కేసు వారీగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని, అనారోగ్యంతో ఆసుపత్రులకు వెళ్లిన కార్మికుల వైద్య బిల్లులను పరిష్కరిస్తామని తెలిపారు. మూడు సంవత్సరాల నిబంధనకు సంబంధం లేకుండా ఖాళీలు ఉన్నచోట వెంటనే ట్రాన్స్‌ఫర్లు చేస్తామని తెలిపారు. మారుపేర్ల సమస్య ప్రభుత్వ స్థాయిలో చర్చించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు,అండర్‌గ్రౌండ్ అలవెన్స్ కట్టింగ్ సమస్యను పరిష్కరిస్తామని మరియు డిస్మిస్ అయిన ఇతర కార్మికుల సమస్య పరిష్కరిస్తామని, ఆసుపత్రుల్లో ఆధార్ వివరాలు మారిన వారికి సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా చికిత్స అందిస్తామని, ఓవర్‌మన్‌లకు పెండింగ్ ప్రమోషన్లు మంజూరు చేస్తామని,అన్‌ఫిట్ అయిన మైనింగ్ మరియు ట్రేడ్స్‌మెన్ కార్మికులకు తగిన సూటబుల్ ఉద్యోగాలు కల్పిస్తామని అదేవిధంగా,రిటైర్డ్ కార్మికులకు నిలిపివేసిన లాభాల వాటా, దీపావళి బోనస్‌్రూా= చెల్లించేందుకు అంగీకరించారు. గోల్డెన్ హ్యాండ్‌షేక్ లేదా ఎ=ూ లాంటివి అమలు చేయబోమని డైరెక్టర్ స్పష్టం చేశారు. కాంట్రాక్టు కార్మికులు జనరల్ సమ్మెలో పాల్గొన్న వాళ్లకి పీనల్ వెజ్ కట్టింగ్ నిలిపివేస్తామన్నారు. అదనంగా, మిగిలిన కీలక సమస్యలను త్వరలో సీఎండీ మరియు డైరెక్టర్ - పా స్థాయిలో జరిగే స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించి పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం గుర్తింపు సంఘం ఎఐటియుసి నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు తెలిపారు. ఈ డైరెక్టర్ పా తో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, ఉపా ప్రధాన కార్యదర్శి సారయ్య, అధికారులు జిఎం పర్సనల్ కవిత నాయుడు, డిజిఎం పర్సనల్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావును కలిసిన కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం



కరీంనగర్ టౌన్, మే 13(ది క్రైమ్ న్యూస్ )కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు బుధవారం బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావును క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ డిప్యూటీ మేయర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు.దీనికి సానుకూలంగా స్పందించిన యాదగిరి సునీల్ రావు నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తూ, వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆటో కార్మికుల సంక్షేమానికి నూతన కమిటీ నిరంతరం కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంక్షేమ సంఘం ముఖ్య నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి బండారి సంపత్ పటేల్, రామచంద్రం కోశాధికారి, చిట్టిమల్ల నాగభూషణం ఉపాధ్యక్షులు కొత్తూరి సత్యనారాయణ, ఈరవేని కుమార్, కుక్కట్ల సంపత్సహాయ కార్యదర్శులు వడ్లకొండ శ్రీనివాస్, ఇరుకుల్ల మహేష్, మీర్జా అలీ కార్యదర్శి యాకూబ్ఈ.సి. శ్రీనివాస్ గౌడ్, బీర్ల రాజు, పరమేశ్వర్, సలీమ్ తదితరులు ఉన్నారు

## త్రాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

### -సర్పంచ్ పల్లె ప్రతిమ-పీవీరావు



రామగిరి, మే 13(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం పంచాయతీ పాలకవర్గ సమావేశం జరిగింది. సర్పంచ్ పల్లె ప్రతిమ- పీవీ రావు అధ్యక్షతన సమావేశం జరగగా, పలు తీర్మానాలు చేశారు. ముఖ్యంగా గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా పూర్తి చర్యలు చేపట్టామని ఆమె తెలిపారు. పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు. లైటింగ్ విషయంలో కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా సమాచార అందిస్తే చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భద్రపు ప్రవళిక ప్రశాంత్, పంచాయతీ సెక్రెటరీ గంగుల సంతోష్, వార్డు సభ్యులు పబ్బా స్రవంతి వెంకటేష్, కలవేన రవి, కండే లక్ష్మి- గట్టయ్య, ఖండే. సాహితి -పోషం, పున్నం. మణితేజ పాల్గొన్నారు.

## వరి కొయ్యలు కాల్చడం వల్ల నష్టాలు వాటిల్లుతాయ్

### -రైతులు ఖర్చులు తగ్గించి లాభాలు ఆర్జించండి.

### -అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్చన.



రామగిరి,మే 13(ది క్రైమ్ న్యూస్):- రైతులు అనవసరపు ఎరువుల, ఇతరత్రా మందుల ఖర్చులు తగ్గించి లాభాలు ఆర్జించాలని జగిత్యాల వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్చన అన్నారు. బుధవారం కమాన్పూర్ మండలంలోని గుండారం గ్రామపంచాయతీ పరిధిలోగల రాజాపూర్ ఐకెపి సెంటర్ వద్ద రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని జగిత్యాల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ అర్చన మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి రసాయనిక ఎరువులు తక్కువగా వాడాలని సూచించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను మాత్రమే పండిస్తే రైతులు అధిక లాభాలు అర్థించవచ్చని పేర్కొన్నారు. ప్రతి రైతు కొన్న ఎరువుల విత్తనాల బిల్లులు భద్రంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. అలాగే సాగునీరు వృధా కాకుండా చూడాలని ఒకే పంట కాకుండా వేర్వేరు పంటలు వేసి స్థిరమైన ఆధారం పొందాలని అన్నారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల నష్టాలు వాటిల్లుతాయని అన్నారు. రాబోవు ఖరీఫ్ సీజన్లో ఏ పంట వేయాలి ఎరువులు ఎలా వాడాలో శాస్త్రవేత్తల, వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాధికారి వీరి రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖ సేవలు గ్రామాలకు.. బాలాజీ తండాలో ఉచిత వైద్య శిబిరం...





నల్గొండ జిల్లా ప్రతినిధి / ది క్రైమ్ న్యూస్ : మే 13 నల్గొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాలాజీ తండా గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో మొత్తం 84 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి, కట్టని పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా 32 దూడలకు ఉచిత నట్టల మందులు త్రాగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్ కుమార్, గ్రామ సర్పంచ్ మాంగ్నీ (ముని), ఎం.ఏ. హమీద్ జూనియర్ వెటర్నరీ ఆఫీసర్, వార్డు సభ్యులు, ఆఫీస్ సబార్డినేట్ ఐలమ్మ, గోపాలమిత్ర దేవసింగ్ పాల్గొన్నారు. గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై క్యాంపును విజయవంతం చేశారు.

## కారును ఢీకొన్న ఆర్టీసీ..... ఇద్దరు మృతి



మానకొండూర్, మే13(ది క్రైమ్ న్యూస్):కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల వద్ద బుధవారం రాత్రి కారును ఆర్టీసీ బస్సు ఢీకొని ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది.కరీంనగర్ వైపు వెళుతున్న కారు రాంగ్ రూట్లో వస్తుండగా కరీంనగర్ నుండి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంగా ఢీకొట్టింది.దీంతో కారులో మంచిర్యాల చెందిన నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తుండగా డ్రైవర్ తో పాటు మరో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెంది మరో ఇద్దరికి తీవ్రగాయాలైయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# పెద్దపల్లి నియోజకవర్గాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతున్నాం

**రూ. 6 కోట్లతో సబ్బితం గౌరి గుండాల జలపాతం అభివృద్ధి**

**పెద్దపల్లి ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా మారుస్తాం**

**రూ. 43 లక్షలతో ప్లాస్టిక్ వ్యర్థాల మేనేజ్మెంట్ యూనిట్**

**ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు**



మంథని ది క్రైమ్ న్యూస్, మే 13,గాండీవం :పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో రూ. 6 కోట్లతో గౌరి గుండాల జలపాతం అభివృద్ధి పనులకు ప్రభుత్వ అధికారులతో మరియు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేసి అనంతరం మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో రూ. 43 లక్షలతో ప్లాస్టిక్ వ్యర్థాల మేనేజ్మెంట్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూలి తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో ఉన్న ఒక ప్రముఖ పర్యాటక ప్రదేశం సబ్బితం జలపాతం అని ఇది పెద్దపల్లి మండలం,సబితం గ్రామం సమీపంలో గట్టు సింగారం కొండల నుండి ఉద్భవించి, వర్షాకాలంలో (జులై నుండి నవంబర్ వరకు) ఆకట్టుకునేలా ప్రవహిస్తుంది. పెద్దపల్లి నుండి 15 కి.మీ దూరంలో ఉన్న ఈ జలపాతం, స్థానికంగా "గౌరీ గుండాలుగా పిలవబడుతూ, దట్టమైన అటవీ ప్రాంతంలో సందర్శకులను ఆకర్షిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం రూ. 6 కోట్లతో జలపాతం అభివృద్ధి చేయడం జరుగుతుందని గత పాలకులు ఈ జలపాతాన్ని ఎన్ని సార్లు సందర్శించిన తట్టెడు మట్టికూడా తీసిన పాపాన పోలేదని కానీ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత తాను శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత రూ. 6 కోట్లు వెచ్చించి అభివృద్ధి పరుస్తున్నామని అవసరమైతే జలపాతం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చూపిస్తామని తెలిపారు. సబితం జలపాతాలు వర్షాకాలంలో గట్టుసింగారం కొండల నుండి నీరు ఉప్పొంగి ప్రవహించడంతో జలపాతాలలాగా మారి అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తాయి. దీనిని సందర్శించడానికి చాలామంది పర్యాటకులు వస్తుంటారని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యాటకంగా ఆహ్లాదకరంగా తీర్చేందుకు జలపాతాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల మేనేజ్మెంట్ యూనిట్ ద్వారా ప్లాస్టిక్ రా మెటీరియల్ తయారీ అవుతుందని తెలిపారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ప్రాసెసింగ్ చేసి ముడి సరుకులు తయారు చేసి టైల్స్, దారం వాటికి ఉపయోగిస్తారని తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వలన క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, ఈ యూనిట్ వలన పర్యావరణ కాలుష్యం తగ్గి పరిశు భ్రత పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ యూనిట్ మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో పని చేస్తుందని, దీనికి గ్రామస్థులు అందరు సహకరించని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, తహసీల్దార్,పర్యాటక అధికారులు గ్రామ సర్పంచులు, కొమ్ము సుజాత,నూనె సరోజన,మునిసిపల్ చెర్మన్ నుగుల్లా మల్లయ్య, మార్కెట్ చెర్మన్ కూర మల్ల రెడ్డి,పాలకవర్గం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న పెద్దమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు.



రామగిరి,మే 13(ది క్రైమ్ న్యూస్):– కమాన్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పిల్లి పల్లెలో గత రెండు రోజులుగా ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి మొదటి వార్షికోత్సవ వేడుకలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఇందులో భాగంగా ఉదయం పుట్ట వద్ద భారీ ఎత్తున పూజలు నిర్వహించి పుట్టబంగారాన్ని తీసుకురావడం జరిగింది. అలాగే అమ్మవారి లగ్నం, నాగవెల్లి సందర్భంగా పుస్తె మట్టెలు డప్పు చప్పుల మధ్య భాజా భజంత్రీల మధ్య తీసుకురావడం జరిగింది. బుధవారం రాత్రి పెద్ద ఎత్తున పట్నంతోపాటు అమ్మవారి లగ్నమా నిర్వహించబడును. బుధవారం రాత్రి ముదిరాజ్ కులాస్తులంతా బోనం గుండెలతో వచ్చి అమ్మవారికి సమర్పిస్తారు.గురువారంతో వార్షికోత్సవ వేడుకలు ముగుస్తాయి.

# జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం..

**త్వరలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు సన్మానం..**

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**




పటాన్చెరు(జిన్నారం), మే 13 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ విద్యారంగంలో చేపట్టిన సంస్కరణల మూలంగా నేడు అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యా వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, ఇంటరాక్టు డిజిటల్ ప్యానెల్స్ ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యారంగానికి దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలు అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. దీని మూలంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు సైతం దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. డిగ్రీ, పీజీ, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో ప్రముఖ కార్పొరేట్ కంపెనీలతో క్యాంపస్ ఇంటర్వ్యూలు ఏర్పాటు చేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయకుండా లక్ష్యంతో చదివి ఉన్నత విజయాలు సాధించాలని విజ్ఞప్తి చేశారు. జిన్నారం జూనియర్ కళాశాల రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని సూచించారు. కళాశాల అభివృద్ధి కోసం మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. కళాశాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. అతి త్వరలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్దన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, గడ్డపోతారం మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణకుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే నాణ్యమైన విద్య ..

**- జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొపెసర్ బీ.రమేష్**




జమ్మికుంట మే 13 (ది క్రైమ్ న్యూస్) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొపెసర్ బీ.రమేష్ అన్నారు. కళాశాలలో బుధవారం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్య వారోత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల తల్లదండ్రుల, పూర్వ విద్యార్థులతో జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ ప్రొపెసర్ బి.రమేష్ మాట్లాడారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్యార్హతలు, అనుభవం గల అధ్యాపకులు ఉన్నారని అన్నారు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన భోధన ఉంటుందని అన్నారు. జమ్మికుంట కళాశాలలోని పదిమంది విద్యార్థులు కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో పీజీ కోర్సులకు అర్హత సాధించారని పెర్కొన్నారు. అలాగే ఇటీవల కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలలో 40 మంది విద్యార్థులకు ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు వచ్చాయని, మరో 41 మంది విద్యార్థులు ఆయా కంపెనీలలో శిక్షణకు ఎంపికైయ్యారని తెలపారు. కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొవాలని ఆయన కొరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీపీడీసీ సభ్యులు పుల్లూరి సంపత్ రావు, టంగుటూరి రాజ్ కుమార్, ఆకుల రాజేందర్ , వైస్–ప్రిన్సిపాల్ డాక్టర్. ఓదెలు కుమార్, స్టాఫ్ సెక్రెటరి డాక్టర్.గణేష్ , ఆకాడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్.రాజేంద్రం, దోస్త్ కో– ఆర్డినేటర్ కిరణ్ కుమార్ , విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ నూతన సీఐ పి.రంజిత్ రావుకు బిఆర్ఎస్ నాయకుల ఘన సన్మానం




సుల్తానాబాద్, మే 14(ది క్రైమ్ న్యూస్) : సుల్తానాబాద్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) గా బాధ్యతలు స్వీకరించిన పి.రంజిత్ రావును సుల్తానాబాద్ మండల బిఆర్ఎస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు , సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ పి.రంజిత్ రావు మాట్లాడుతూ.. సుల్తానాబాద్ మండల పట్టణ వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణకు, ప్రజల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజాప్రతినిధులు, నాయకులు పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గర్రపల్లి ప్యాక్స్ చైర్మన్ జూపల్లి సందీప్ రావు, మండల కన్వీనర్ బోయినీ రాజమల్లు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్ళపల్లి మనోజ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్, సుద్దాల సర్పంచ్ ఒజ్జ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంపాడు గ్రామంలో బడిబాటి కార్యక్రమం

**ప్రభుత్వం కలిపిస్తున్న సౌకర్యాల పై తల్లిదండ్రులకు అవగాహన**






మధిర ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి మే 14: మధిర మండలం ఖమ్మంపాడు యుపిఎస్ ఖమ్మంపాడు ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో గురువారం నాడుగ్రామం లో బడి బాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో గ్రామములో బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణలో పిటిఎం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు షేక్ మదార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలపై వివరించారు.వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తో పాటు బ్రేక్ ఫాస్ట్ ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు టై బెల్టు బ్యాగ్ తదితర 21 రకాల వస్తువులతో కిట్ ను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ గ్రామ పెద్దలు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అందరి సమన్వయంతో పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అత్యద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని విద్యార్థులు అందరిని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమం లో ఏ ఏ పీ సి చైర్మన్ మాణిక్యమ్మ, గ్రామ ఉప సర్పంచ్ దొండపాటి ఉషారాణి వార్డు మెంబర్లు,తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఆర్ బ్రహ్మారెడ్డి వి లక్ష్మారెడ్డి వి లక్ష్మీ ప్రసన్న కే సునీత గ్రామ పెద్దలు హాజరయ్యారు

# అంబలి పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ కార్యదర్శి గాండ్ల మోహన్



మంథని దిక్రైమ్ న్యూస్ 14: కమాన్‌పూర్ మండల కేంద్రంలో చత్రపతి శివాజీ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. మండల ప్రజలకు వేసవి కాలంలో చల్లదనాన్ని అందించాలనే ఉద్దేశంతో మల్యాల శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాండ్ల మోహన్ ప్రజలకు స్వయంగా అంబలి పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని అభినందించారు. సమాజంలో సేవా భావంతో ముందుకు వస్తున్న యువతను ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కలిగించే ఇటువంటి కార్యక్రమాలు మరింత అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్యాల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సేవా సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

# సాదాసీదాగా... సరదాగా కాసేపు ముచ్చటించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




మంథని ది క్రైమ్ న్యూస్ మే 14 : రాజకీయ నాయకుల జీవితం ఎప్పుడూ ప్రజా కార్యక్రమాలు, సమావేశాలు, సమస్యల పరిష్కారాలతో బిజీగానే సాగుతుంది. ముఖ్యంగా ప్రతిపక్ష నాయకులైతే ప్రజల మధ్య తిరుగుతూ నిరంతరం రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉంటారు. అలాంటి తీరికలేని సమయంలో కూడా కొద్దిసేపు సాధారణ వ్యక్తిలా గడపడం అరుదుగా కనిపిస్తుంది. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కమాన్‌పూర్ మండల కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా కాసేపు సరదాగా గడిపారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలోని సయ్యద్ కేఫ్‌లో సాధారణ వ్యక్తిలా కూర్చొని టీ తాగుతూ స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఎటువంటి హడావిడి లేకుండా అందరితో కలిసిమెలిసి మాట్లాడిన ఆయన తీరు అక్కడున్న వారిని ఆకట్టుకుంది. రాజకీయాల మధ్యలో కూడా సాధారణ జీవనశైలిని ఆస్వాదిస్తూ ప్రజలతో మమేకమవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# వ్యవసాయ అవసరాలకే చెరువు మట్టిని వినియోగించాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**నేటి నుంచి సంబంధిత తహసీల్దార్‌కు రైతులు దరఖాస్తు చేసుకోవాలి**

**రైతులకు ఉచితంగా సారవంతమైన చెరువు మట్టి అందజేత**

**చెరువు మట్టిని ఇతర అవసరాలకు మళ్లిస్తే కఠిన చర్యలు**



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువులలోని సారవంతమైన చెరువు మట్టిని తమ వ్యవసాయ భూములకు తరలించేందుకు ఆసక్తి గల రైతులు నేటి నుంచి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీరు లేని చెరువుల నుంచి చెరువు మట్టిని వ్యవసాయ భూములకు తరలించుకోవడానికి అనుమతులు మంజూరు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులో రైతు వివరాలు, భూమి విస్తీర్ణం, పీపీబీ వివరాలు, రవాణా వాహనం వివరాలు, వాహన నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు.సంబంధిత తహసీల్దార్ దరఖాస్తులను పరిశీలించి అనుమతులు జారీ చేస్తారని, అనంతరం రైతులు చెరువుల నుంచి చెరువు మట్టిని తరలించుకోవచ్చని కలెక్టర్ వివరించారు.రైతులకు ఈ సారవంతమైన చెరువు మట్టిని పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ చెరువు మట్టిని కేవలం వ్యవసాయ అవసరాలకే వినియోగించాలని స్పష్టం చేశారు.చెరువు మట్టిని ఇతర అవసరాలకు మళ్లించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించి, కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

# హాలియా అమృత్ స్కీం పనుల్లో వేగం పెంచాలి..

నల్గొండ జిల్లా ప్రతినిధి : ది క్రైమ్ న్యూస్ : మే 14 నల్లగొండ జిల్లా హాలియా మున్సిపాలిటీలో అమృత్ స్కీం కింద నిర్మాణంలో ఉన్న సాగర్ రోడ్డులోని మీ= వెంచర్ ట్యాంకుల నిర్మాణ పనులను పబ్లిక్ హెల్త్ ఎస్.ఈ వేంకటేశ్వర్లు గారు పరిశీలించారు. పర్యవేక్షణ అనంతరం హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి గారు మాట్లాడుతూ, అమృత్ స్కీం పరిధిలో నిర్మాణంలో ఉన్న నాలుగు ట్యాంకుల పనులను వేగవంతం చేసి, ఎక్కువ మంది కార్మికులను నియమించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ ఎస్.ఈ గారిని కోరారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి గారు, పబ్లిక్ హెల్త్ డి.ఈ గారు, పబ్లిక్ హెల్త్ ఏ.ఈ గారు తదితరులు పాల్గొన్నారు.

# వెల్దిలో బడిబాట ర్యాలీ.....!

మానకొండూర్, మే14(ది క్రైమ్ న్యూస్):కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్ది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు గురువారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించిన అనంతరం మధ్యాహ్న భోజనం పథకంపై అపోహలకు విద్యార్థులు,తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు.ఎంపీడీఓ వరలక్ష్మి, పంచాయతీ పాలకవర్గం,ఎపిసి చైర్మన్ కనకలక్ష్మి ,ప్రదానోపాధ్యాయులు ఎంఈఓ రాపెల్లి శ్రీనివాస్,కార్యదర్శి వెంకటరమణ, ఉపాధ్యాయులు,గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు,ఆరోగ్య సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు బడిబాటలో పాల్గొన్నారు.



# అబద్ధాలు ప్రచారం చేయడంలో వంశీక్రిష్ణకు సాటిలేరు

**-ఉద్దేశపూర్వకంగానే కేంద్రంపై నిందలు..**

**కాంగ్రెస్ పాలనలో నీకే ప్రోటోకాల్ దిక్కులేదు..**

**బిజెపిని విమర్శిస్తే ఇక ఊరుకునే పరిస్థితి లేదు..**

**పెద్దపల్లి ఎంపికి బిజెవైఎం నేతల కౌంటర్..**




పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : కేంద్ర ప్రభుత్వంపై పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు వంశీక్రిష్ణ ఉద్దేశ్యపూర్వకంగానే అసత్య ఆరోపణలు చేస్తున్నారని భారతీయ జనతా యువమోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పు కిరణ్ మండిపడ్డారు.గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్బులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణా రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని, బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకే నిధులు కేటాయిస్తోందని అబద్దాలు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ నిజాయతిగా నిధులు కేటాయిస్తున్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి, ఆర్వోబిల నిర్మాణానికి, పరిశ్రమల ఏర్పాటుకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ఇటీవల ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంఖుస్థాపన చేసిన విషయం, రామగుండం ఆర్ఎఫ్సిఎల్ పున:ప్రారంభం సందర్భంగా రూ.5,250కోట్లు ఇచ్చిన సంగతి ఎలా మరిచారని నిలదీశారు. మీ ప్రభుత్వంలో మీకే తగిన గుర్తింపు లేదని, ప్రోటోకాల్ విషయంలో మీకు జరుగుతున్న అవమానాలు ప్రజలకు తెలుసునన్నారు. మీ పరువును కాపాడటం కోసం జిల్లా కలెక్టరును టార్గెట్ చేయడం నిజం కాదా అని అడిగారు. అసలు మీరు మంచిర్యాల జిల్లాకు ఎంపియా, లేక పెద్దపల్లి జిల్లాకు ఎంపియా అని మీ కార్యకర్తలే సోషల్ మీడియాలో ప్రశ్నించడమేంటని ఎద్దేవా చేశారు. 1400మంది హిందూ అమ్మాయిలపై అత్యాచారం జరిపిన వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందని, అలాంటి దుర్మార్గపు పార్టీలో ఉన్న మీరు బిజెపి గెలుపు గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఇకపై అసత్యాలు, అబద్దాలు ప్రచారం చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజల నుండి ప్రతిఘటన తప్పదని కిరణ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వెంకన్న, పట్టణ ఉపాధ్యక్షులు పోగుల రాజు, పట్టణ కార్యదర్శి కుశనపల్లి మధుకరణ్ బాగావత్, పట్టణ అధ్యక్షులు కుక్క అంజి, ఎస్సిమోర్చా పట్టణ అధ్యక్షులు సిందే శివసాయి, హర్ష, మహేష్, హరీష్, గదాసి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నాం

**- గూడెం మహిపాల్ రెడ్డి**

**రూ.1.50 కోట్ల సొంత నిధులతో రాజగోపురాల నిర్మాణం**



పటాన్చెరు, మే 14(ది క్రైమ్ న్యూస్) :పటాన్చెరు నియోజకవర్గంలోని గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక దేవాలయం ఆవరణలో నిర్మించిన మూడు రాజగోపురాలను ఆగస్టు 16న ప్రారంభించనున్నట్లు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అదే రోజు ఆలయ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గురువారం ఉదయం దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, ధర్మకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆలయ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయానికి నాలుగు వైపుల నిర్మిస్తున్న రాజగోపురాల పనులు పూర్తయ్యాయని తెలిపారు. రూ.1.50 కోట్ల సొంత నిధులతో ఈ నిర్మాణాలను చేపట్టినట్లు చెప్పారు. ఆలయంలో కొనసాగుతున్న సాలహారం పనులు మందకొడిగా సాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ పురోహితులు, పాలకవర్గం సూచనల మేరకు ప్రారంభోత్సవ తేదీని నిర్ణయించినట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఆలయానికి అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీలు గాయత్రి పాండు, శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, నరసింహారెడ్డి, వెంకన్న, స్థానిక కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి లావణ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో కాంగ్రెస్ నూతన మండలాధ్యక్షుల నియామకం

మానకొండూర్,మే14(ది క్రైమ్ న్యూస్):కరీంనగర్ జిల్లా మానకొండూర్



నియోజకవర్గంలోని అన్ని మండలాలకు కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులను నియమిస్తూ గురువారం టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.మానకొండూర్ - ద్యావ శ్రీనివాస్ రెడ్డి, తిమ్మాపూర్ - బండారి రమేష్ గౌడ్,శంకరపట్నం- బండారి తిరుపతి, గన్నేరువరం - బొడ్డు సునిల్, బెజ్జంకి - లింగాల శ్రీనివాస్, ఇల్లంతకుంట - కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి నియమితులైయ్యారు. నూతన అధ్యక్షులు పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని కోరుతూ మాజీ మండలాధ్యక్షులకు త్వరలోనే పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇస్తూ నూతన అధ్యక్షులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి అభినందనలు తెలిపారు.

# పీఎంజే జ్యువలరీ దోపిడీ కేసులో ముగ్గురి అరెస్ట్..

**-రూ 51 వేల నగదు స్వాధీనం**




బ్యూరో(ది క్రైమ్ న్యూస్) : కరీంనగర్‌లో సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెల్లరీ నగల దుకాణం దోపిడీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్ .ఈనెల 3వ తేదీన పీఎంజే జ్యువెల్లరీ లో సిబ్బందిని తుపాకులతో గాయపరిచి సుమారు రూ. 82.02 లక్షల విలువైన 161.4 తులాల బంగారం, 112 క్యారెట్ల వజ్రాలను దోచుకుని పారిపోయిన 5 గురిలో ముగ్గురిని అరెస్టు చేశామని గురువారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని అస్ర హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వివరాలను వెల్లడించారు.ఈ భారీ దోపిడీ వెనుక బీహార్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్, 'ది గోల్డెన్ థీఫ్'గా పేరుగాంచిన సుబోధ్ సింగ్ హస్తం ఉందని దర్యాప్తులో తేలిందని సీపీ తెలిపారు. జైలు నుంచే అతను ఈ పథకాన్ని రూపొందించాడని వివరించారు.ఈ ముఠా ముందస్తుగా రేక్కీ నిర్వహించడం, నేరము చేసిన తరువాత తప్పించుకునే మార్గాలను గుర్తించడం, నకిలీ ఆధార్ కార్డులు, నకిలీ బైక్ నంబర్ ప్లేట్లు ఉపయోగించడం, తప్పుడు పేర్లతో లాడ్జలలో ఉండడం, ఆధునిక సాంకేతికత వినియోగించడం వంటి పద్ధతులతో ఆయుధాలతో దోపిడీలు నిర్వహించేది.సుబోధ్ సింగ్ హస్తం ఉందని దర్యాప్తులో తేలిందని సీపీ తెలిపారు. జైలు నుంచే అతను ఈ పథకాన్ని రూపొందించాడని వివరించారు.తెలంగాణకు రెండు నెలల క్రితం సుభోద్ సింగ్ గ్యాంగ్ ప్రణాళిక ప్రకారం వచ్చారని సీపీ తెలిపారు.ఈ ముఠా సభ్యులు అత్యంత ప్రమాదకరమైన వారని, ఈ అంతరాష్ట్ర గ్యాంగ్ తెలంగాణ జిల్లాలో ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్ వంటి పట్టణాల్లో క్షుణ్ణంగా రెక్కీ నిర్వహించారని, పోలీసులకు చిక్కకుండా నకిలీ బైక్ నంబర్ ప్లేట్లు, నకిలీ గుర్తింపు కార్డులను వాడారని పేర్కొన్నారు. ఈ దోపిడీ కేసును తమ సిబ్బంది ఒక సవాల్‌గా తీసుకుని, అత్యంత చాకచక్యంగా ఛేదించారని ఆయన కొనియాడారు. తెలంగాణకు రెండు నెలల క్రితం సుభోద్ సింగ్,అతని అనుచరుల ప్రణాళిక ప్రకారం వచ్చారని సీపీ తెలిపారు.ఈ ముఠా సభ్యులు అత్యంత ప్రమాదకరమైన వారని సీపి తెలిపారు. తెలంగాణలోకి ప్రవేశించే ముందు వీరు జార్ఖండ్-పశ్చిమ బెంగాల్ సరిహద్దులో మెహతాబ్ ఖాన్ వద్ద ఒక్కో సిమ్ కార్డును రూ.10,000 చొప్పున కొనుగోలు చేశారు.అనంతరం వీరు ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల్లో తిరుగుతూ జ్యువెలరీ షాపులు, బ్యాంకుల పై రేక్కీ నిర్వహించారు. చివరకు కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షాప్‌ను లక్ష్యంగా ఎంచుకుని పెద్దపల్లిలోని ఒక లాడ్జ్ లో బస చేశారు.ఈనెల 1వ తేదీ శుక్రవారం రోజున ధర్మపురిలోని విజయలక్ష్మి గెస్ట్ హౌస్‌కు మారి దోపిడీకి సిద్ధమయ్యారు.సుభోద్ సింగ్ అనుచరుల సమాచారంతో రఘునాథ్ కర్మాకర్ మంచిర్యాలకు వెళ్లి రైలులో చంద్రపూర్ సమీపానికి చేరుకున్నాడు. అక్కడ ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఈనెల 2తేదిన గడ్‌చందూర్ పరిసరాల్లో ఆరు పిస్టల్స్ మరియు మ్యాగజైన్లు అందజేశారు. అనంతరం రఘునాథ్ కర్మాకర్ ఆయుధాలతో ధర్మపురికి తిరిగి వచ్చాడు. 3వ తేదీన ఉదయం ఐదుగురు నిందితులు ధర్మపురిలో వారు ఉన్న లాడ్జ్ ఖాళీ చేసి రెండు బైక్‌ల పై బయలుదేరారు. బ్యాగులను కొండ ప్రాంతంలో దాచిపెట్టి, అక్కడే వారి బైక్ నంబర్ ప్లేట్లు మార్చి, వెలిచాల ఎక్స్ రోడ్ వద్దకి చేరుకొని అక్కడ టిఫిన్ చేసి, దోపిడీ ప్రణాళికను మరోసారి చర్చించారు.తరువాత ఉదయం 10:50 గంటలకు పీఎంజే జ్యువెలరీ షాప్‌కు చేరుకున్నారు. ప్రణాళిక ప్రకారం రాధే అలియాస్ అభయ్ కస్టమర్‌లా షాప్‌లోకి వెళ్లి పరిస్థితిని గమనించాడు. రాధే మెస్సేజ్ ఇచ్చిన తర్వాత మిగతా నిందితులు లోపలికి ప్రవేశించి సిబ్బందిని ఆయుధాలతో బెదిరించారు. నగలు దోచుకొనుచునడగా స్టాఫ్ ప్రతిఘటించడముతో నిందితులు వారి వద్ద ఉన్న ఆయుదాలతో స్టాఫ్ పై కాల్పులు జరిపారు.నిందితులు షాప్ నుండి పారిపోతూ వారు షాపులో దోచుకున్న ఒక ఆభరణాల బ్యాగ్‌ను తీసుకుని పారిపోయారు. ఆందోళనలో మరో బ్యాగ్‌ను షాప్‌లోనే వదిలివేశారు. ముందుగా నిర్ణయించిన మార్గంలో ధర్మపురికి చేరుకున్నారు.సనోజ్, రాధే అలియాస్ అభయ్, ప్రద్యుమన్ గోదావరి నది ఒడ్డున పల్సర్ బైక్‌ను వదిలి నడుచుకుంటూ నది దాటి మంచిర్యాల నుంచి రైలులో పరారయ్యారు.దోపిడీ ముఠాను పోలీసు టీం సాంకేతిక నిఘా ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఇప్పటివరకు 13 మంది నిందితులను గుర్తించాయి.ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జగీరా సింగ్‌ను 13వ తేదీన సాయంత్రం 4 గంటల సమయంలో వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద అరెస్ట్ చేశారు.మరో ఇద్దరు నిందితులు రవీష్ కుమార్ అలియాస్ ప్రద్యుమన్ మరియు మెహతాబ్ ఖాన్‌లను బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్‌పై తీసుకువచ్చారు.ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జాగీర్ సింగ్‌తో పాటు రవీష్ కుమార్, మెహతాబ్ ఖాన్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 51 వేల నగదు, 2 మొబైల్ ఫోన్లు, రెండు సిమ్ కార్డులు, నిందితులు వాడిన నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.పరారీలో ఉన్న మిగతా నిందితులను పట్టుకోవడానికి చోరికి గురైన ఆభరణాలను రికవరీ చేయడానికి 5 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు సిపి తెలిపారు త్వరలోనే అందర్నీ పట్టుకొని ఆభరణాలను స్వాధీనం చేసుకుంటామని వ్యాపారులు భయపడవలసిన అవసరంలేదని భద్రత మరింత కట్టుదిట్టం చేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ బడే ప్రగతికి బాట: ఊషన్నపల్లిలో వినూత్న విద్యా చైతన్య ర్యాలీ

**కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా డిజిటల్, ఏసీ క్లాస్ రూములు**

**వరుసగా రెండుసార్లు జిల్లా 'బెస్ట్ ఛాంపియన్ స్కూల్' అవార్డు కైవసం**

**బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపాలి: హెచ్ఎం ఈర్ల సమ్మయ్య**



సుల్తానాబాద్, మే 14(ది క్రైమ్ న్యూస్) : ప్రభుత్వ పాఠశాలలు ప్రగతికి సోపానాలని, ప్రభుత్వ బడుల్లో చదువు విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అన్నారు. పాఠశాల ప్రాముఖ్యతను, అందుబాటులో ఉన్న అత్యాధునిక వసతులను వివరిస్తూ గురువారం గ్రామ వీధుల్లో ఫ్లెక్సీ బ్యానర్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున చైతన్య ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ దేవాలయం చావడి వద్ద గ్రామస్తులు, తల్లిదండ్రులతో ప్రత్యేక అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ.. గ్రామంలోని బడి ఈడు పిల్లలందరినీ ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలకే పంపించి ఉచిత నాణ్యమైన విద్యను ఉపయోగించుకోవాలని కోరారు. పాఠశాలలో విద్యార్థుల కోసం మినరల్ వాటర్ ప్లాంట్, ఫ్రిడ్జ్, డిజిటల్ బోధన కోసం ఇంటరాక్టివ్ ప్యానల్ (స్మార్ట్ టీవీ), ప్రతి గదిలో గోడ గడియారాలు, అద్దాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అతి త్వరలోనే కంప్యూటర్లు, సోలార్ విద్యుత్తుతో పాటు కొత్త తరగతి గదుల్లో ఏసీలు , సరికొత్త డిస్క్ బెంచీలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పాఠశాలలో కేవలం మౌలిక వసతులే కాకుండా ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉత్తమ విద్యను అందిస్తున్నామని, అందుకే తమ పాఠశాలకు వరుసగా రెండుసార్లు జిల్లా 'బెస్ట్ ఛాంపియన్ స్కూల్' అవార్డు దక్కిందని ఆయన గర్వంగా ప్రకటించారు. ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) ప్రవేశ పరీక్షలో ఐదుగురు, గురుకుల ప్రవేశ పరీక్షలో ఏడుగురు, రాష్ట్రస్థాయి తెలుగు పద్యాల పోటీల్లో ఇద్దరు విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి విజయం సాధించారని వివరించారు. పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రతిరోజు ఉదయం పాలు, టిఫిన్ తో పాటు మధ్యాహ్నం రుచికరమైన, శుచికరమైన భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల చదువుకు భారం కాకూడదనే ఉద్దేశంతో నూతనంగా 21 వస్తువులతో కూడిన భారీ విద్యా సామగ్రి కిట్‌ను ప్రతి పిల్లవానికి ఉచితంగా అందజేస్తామన్నారు. తల్లిదండ్రులు ప్రైవేట్ బడుల వైపు వెళ్లి మోసపోకుండా తమ పిల్లలను ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గంగారం హైస్కూల్ టీచర్ జి. రవి, ప్రీ ప్రైమరీ పాఠశాల టీచర్, ఆయాలు శ్రీవాణి, స్రవంతి, విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు , గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్దమ్మ బోనాల వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎస్ ఎస్ అన్వర్



మంథని ది క్రైమ్ న్యూస్ మే 14 : కమాన్‌పూర్ మండల కేంద్రంలోని పిల్లిపల్లెలో జరుగుతున్న పెద్దమ్మ బోనాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం ఆహ్వానం మేరకు గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్న నాయకులు ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, ముదిరాజ్ సంఘం సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ గౌడ్,ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్ సోహెల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పిల్లి చంద్ర శేఖర్,ఇనగంటి పాపారావు, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు మహేష్ గౌడ్, ఎంఎ సెల్ మండల అధ్యక్షులు కుక్క రవీందర్, చాట్ల గట్టయ్య, ఆదివారహ దేవస్థానం డైరెక్టర్ పిల్లి రాజు, పిడుగు బీమాలింగు, జంగపెల్లి కనకయ్య, తదితరులు పాల్గొన్నారు

# నిపుణులుగా ఎదిగి వృత్తిలో రాణించండి

**గీతం విద్యార్థులకు ప్రొఫెసర్ సంజీవ్ కుమార్ సూచన**




పటాన్చెరు, మే 14(ది క్రైమ్ న్యూస్) : ఎంపిక చేసుకున్న రంగంలో నిపుణులుగా ఎదిగి, ఆయా వృత్తుల్లో మేటివారిగా రాణించాలని ప్రొఫెసర్ సంజీవ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం లో, ఎంఐటీ-డబ్ల్యూపీయూ విశ్వవిద్యాలయం సహకారంతో నిర్వహించిన రెండు వారాల "జాతీయ విద్యా ఇమ్మర్షన్ కార్యక్రమం" గురువారంతో ముగిసింది. భవిష్యత్ తరానికి చెందిన మీడియా నిపుణులను తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన ఈ కార్యక్రమం ముగింపు వేడుకలో డాక్టర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం యొక్క అసలు విలువ కేవలం విద్యాపరమైన వినిమయంలోనే కాకుండా, పాల్గొనేవారిలో జిజ్ఞాస, సహకారం, పరస్పర సంభాషణ స్ఫూర్తిని పెంపొందించడంలో ఉందన్నారు. నూతన ఆవిష్కరణలు, అర్థవంతమైన విద్యా భాగస్వామ్యాలకు వేదిక కల్పించినందుకు ఎంఐటీ-డబ్ల్యూపీయూ విశ్వవిద్యాలయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం రెండు విద్యాసంస్థల మధ్య మరింత బలమైన సహకారానికి నాంది పలికిందన్నారు. ఎంఐటీ-డబ్ల్యూపీయూ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ అను నాయర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో 71 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. గీతంతో మరిన్ని సంయుక్త కార్యక్రమాల కోసం తమ సంస్థ ఎదురు చూస్తోందని తెలిపారు. విద్యార్థులు ముఖ్యంగా ఆచరణాత్మక అభ్యాస అనుభవాలను ఎంతో ఆసక్తిగా స్వీకరించారని పేర్కొన్నారు. మే 1 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన ఈ ఇమ్మర్షన్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సమకాలీన మీడియా పద్ధతులు, కమ్యూనికేషన్ వ్యూహాలు, డిజిటల్ స్టోరీటెల్లింగ్, పరిశ్రమ ఆధారిత శిక్షణపై విస్తృత అవగాహన కల్పించారు. నిపుణుల ఉపన్యాసాలు, కార్యశాలలు, ముఖాముఖి కార్యక్రమాలు, ప్రాక్టికల్ శిక్షణల ద్వారా విద్యాపరమైన జ్ఞానం మరియు వృత్తిపరమైన మీడియా పరిశ్రమ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా కార్యక్రమం కొనసాగింది.రెండు విద్యాసంస్థల అధ్యాపకులు, ప్రముఖులు ఈ ఉమ్మడి కృషిని ప్రశంసించారు. పరిశ్రమకు సిద్ధంగా ఉన్న, సామాజిక బాధ్యత కలిగిన మీడియా నిపుణులను తీర్చిదిద్దడంలో అనుభవపూర్వక అభ్యాసం, వివిధ రంగాల పరిజ్ఞానం, విద్యా భాగస్వామ్యాల ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. కార్యక్రమంపై విద్యార్థులు కూడా సానుకూల స్పందన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రయోగాత్మక యానిమేషన్ తరగతులు, మోషన్ గ్రాఫిక్స్ సెషన్లు, ఆడియో ప్రొడక్షన్-సౌండ్ డిజైన్ కార్యశాలలు, అలాగే పీసీఆర్ గదిలో మూడు ప్రాజెక్టులను రూపొందించిన ప్రత్యక్ష అనుభవాన్ని ప్రశంసించారు. విద్యార్థులు రూపొందించిన రెండు లఘు వీడియోలను ఈ సందర్భంగా ప్రదర్శించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యున్నతికి తోడ్పాటును అందించాలి

**- జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొపెసర్ బీ.రమేష్**

జమ్మికుంట మే 14 (ది క్రైమ్ న్యూస్) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యున్నతికి కళాశాల పూర్వ విద్యార్థులు తమ తోడ్పాటును అందించాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొపెసర్ బీ.రమేష్ అన్నారు. కళాశాలలో గురువారం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్య వారోత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులైన ప్రజాప్రతినిధుల(సర్పంచ్ ల) ను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పలువురు ఆయా గ్రామాల సర్పంచ్ లుగా గెలుపొందడం అబినందనీయమని అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చాల ప్రత్యేకత ఉందన్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్దులు చాల చైతన్య వంతులని, వివిధ రంగాలలో రాణిస్తున్నారని అన్నారు. అలాగే ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు తమవంతు సహకరించాలన్నారు. కళాశాలలో వినూత్నమైన జాబ్ ఓరియంటెడ్ కోర్సులు ఉన్నాయన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరు ప్రత్యేక హాస్టల్స్ వసతి ఉందన్నారు. ఉన్నతమైన విద్య అర్హతలు, భోధన నైపుణ్యం ఉన్న అధ్యాపకులు ఉన్నారని పెర్కొన్నారు. కళాశాలలో నాణ్యమైన డిజిటల్ తరగతుల భోధన ఉందని అన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొవాలని ఆయన కొరారు.



## ఫేస్ ప్యాక్ లు, హెయిర్ ఆయిల్స్ ఏమీ అక్కర్లేదు..జస్ట్ ఇది తింటే దట్టమైన జుట్టు, మెరిసే చర్మం

ఆరోగ్యవంతమైన జుట్టు, అందమైన చర్మం ప్రతీ ఒక్కరి కల. ఈ కలను నిజం చేయడానికి కొందరు అయితే చేయని ప్రయత్నం ఉండదు. రకరకాల క్రీమ్స్, ఆయిల్స్, షాంపూలు, సీరమ్స్,మార్కెట్లో ఏది కొత్తగా వచ్చినా వెంటనే కొనేసి ప్రయత్నించేస్తుంటారు. కొన్నిసార్లు ఫలితం ఉంటుంది, మరికొన్నిసార్లు నిరాశే మిగులుతుంది. అయితే మీ అందాన్ని రెట్టింపు చేసే అద్భుతమైన పరిష్కారం మీ వంటగదిలోనే దాగి ఉందని మీకు తెలుసా? ఎలాంటి దుష్ప్రభావాలు, రసాయనాల బెడద లేని ఒక సహజసిద్ధమైన ఫుడ్ మీ చర్మాన్ని, జుట్టును లోపలి నుండి పోషించి, ఆరోగ్యంగా మారుస్తుంది. పోషకాహార నిపుణురాలు సిమ్రాన్ చోప్రా తన ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ లో షేర్ చేసిన ఓ వీడియోలో..జుట్టు, చర్మ ఆరోగ్యానికి సామయపడే ఆరోగ్యకరమైన స్నాక్ గురించి తెలియజేశారు. అదే ఫైనాఫిల్ రైతా. పెరుగు, పైనాపిల్ కలయికతో చేసే పైనాపిల్ రైతా.. మన చర్మ, కేశ సౌందర్యానికి అవసరమైన పోషకాలను అందించి, వాటిని ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కేవలం ఆరోగ్యకరమైనదే కాదు, తినడానికి కూడా ఎంతో రుచిగా ఉంటుంది. పైనాపిల్ రైతా స్కిన్, హెయిర్ కి ఎలా మేలు చేస్తుంది? ఫైనాఫిల్ ఇలా పైనాపిల్‌లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఈ విటమిన్ సి మన శరీరంలో 'కొల్లాజెన్' అనే ప్రొటీన్ ఉత్పత్తికి అత్యంత అవసరం. కొల్లాజెన్ అంటే మన చర్మానికి ఒక ఆధారం లాంటిది. ఇది చర్మాన్ని బిగుతుగా, మృదువుగా ఉంచుతుంది, ముడతలు రాకుండా కాపాడుతుంది. వయసు పెరిగే కొద్దీ తగ్గే కొల్లాజెన్ ఉత్పత్తిని పైనాపిల్ ప్రేరేపిస్తుంది. అంతేకాకుండా కొల్లాజెన్ జుట్టు కుదుళ్లను బలపరిచి, జుట్టు రాలడాన్ని తగ్గించి ఒత్తుగా పెరిగేలా చేస్తుంది. జుట్టుకు మెరుపునిస్తుంది. పైనాపిల్ లో ఉండే బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఒక శక్తివంతమైన యాంటీ ఇన్ ఫ్లమేటరీ (వాపును తగ్గించే) ఏజెంట్ గా పనిచేస్తుంది. ఇది చర్మంపై మంట, ఎరుపుదనం, మొటిమల వల్ల కలిగే వాపును తగ్గిస్తుంది. చనిపోయిన చర్మ కణాలను తొలగించి చర్మాన్ని శుభ్రంగా, మచ్చలు లేకుండా, కాంతివంతంగా మార్చడంలో సహాయపడుతుంది. పెరుగు అలా ఇంట్లో తయారుచేసిన పులియని పెరుగు ఒక అద్భుతమైన ప్రోబయోటిక్. మన జీర్ణవ్యవస్థకు మేలు చేసే మంచి బ్యాక్టీరియా ఇందులో ఉంటుంది. చాలా చర్మ, జుట్టు సమస్యలకు మూలం మన కడుపులోని అసమతుల్యతే. జీర్ణవ్యవస్థ సరిగ్గా లేకపోతే పోషకాలు సరిగా అందవు, వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇది మొటిమలు, చర్మం నిర్జీవంగా మారడం, జుట్టు రాలడం వంటి సమస్యలకు దారితీస్తుంది. పెరుగులోని ప్రోబయోటిక్స్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచి ఈ సమస్యల నుండి మనల్ని కాపాడతాయి. కడుపు చల్లగా ఉంటే చర్మం కూడా ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటుంది. పెరుగులో ప్రోటీన్, విటమిన్ బి కాంప్లెక్స్ సమృద్ధిగా ఉంటాయి. ప్రోటీన్ చర్మ కణాల మరమ్మత్తుకు, కొత్త కణాల ఉత్పత్తికి అవసరం. ఇది జుట్టు కుదుళ్లను బలపరిచి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. విటమిన్లు చర్మానికి తేమను అందించి, ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు మెరుపునిచ్చి, చిట్లడాన్ని తగ్గిస్తాయి.

## బొప్పాయి గింజలతో ఇన్ని లాభాలా..?



బొప్పాయి పండు తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. శరీరానికి శక్తిని కూడా ఇస్తుంది. అయితే, బొప్పాయి పండు విత్తనాలను మనం చెత్తగా భావించి పడేస్తాము. కానీ, ఈ విత్తనాల ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయి. ఈ నల్లటి బొప్పాయి గింజలు బరువు తగ్గడంలో ఎంతో సహాయపడతాయి. పోషకాలతో సమృద్ధిగా ఉన్న ఈ విత్తనాలు అనేక తీవ్రమైన వ్యాధులతో పోరాడే శక్తిని కలిగి ఉంటాయి. కాగా, బొప్పాయి గింజలు ఎలాంటి సమస్యలలో పని చేస్తాయో మనం ఇప్పుడు తెలుసుకుందాం. తరచుగా అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు ఉంటే బొప్పాయి గింజలు ఒక వరంలా పనిచేస్తాయి. ఇందులో 'పపైన్' అనే ఎంజైమ్ ఉంటుంది. కావున ఈ పండు విత్తనాలు ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడంలో, ఆహారాన్ని బాగా జీర్ణం చేయడంలో ఎంతో సహాయపడుతుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. అంతేకాకుండా కడుపు సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. నేటి కాలంలో మనం తీసుకునే ఆహారం, జీవనశైలి కాలేయంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. అయితే బొప్పాయి గింజలు కాలేయాన్ని క్లీన్ చేసి ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతో సహాయపడతాయి. ఈ పండు గింజలు కాలేయాన్ని దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ నుండి కాపాడుతాయి. అంతేకాకుండా కాలేయ సిర్రోసిస్ వంటి తీవ్రమైన సమస్యలలో కూడా ఈ పండి విత్తనాలు సహాయపడతాయి. మన మూత్రపిండాలు మన శరీరం నుండి వ్యర్థ పదార్థాలను తొలగించడానికి పనిచేస్తాయి. బొప్పాయి గింజలు మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా సహాయపడతాయి. ఈ బొప్పాయి పండు గింజలు మూత్రపిండాలను క్లీన్ చేయడంలో, దాని పనితీరును మెరుగుపరచడంలో ఎంతో సహాయపడతాయి.

### బొప్పాయి గింజలను ఆహారంలో ఎలా చేర్చుకోవాలి?

బొప్పాయి గింజలు కొద్దిగా చేదుగా ఉంటాయి. కావున వాటిని ఎండబెట్టి పొడిగా చేసి సలాడ్లు లేదా గంజిలో కలిపి తీసుకోవచ్చు. ప్రారంభం దశలో ఈ పొడిని తక్కువ పరిమాణంలో తీసుకోవడం మంచిది. తర్వాత నెమ్మదిగా పెంచుతూ పోతే సరిపోతుంది.

## పిగ్మెంటేషన్‌కు చెక్!



యువతులను ఎక్కువగా వేధించే సమస్య.. పిగ్మెంటేషన్. బుగ్గలు, నుదురుపై ఏర్పడే ఈ నల్లటి మచ్చలు.. అమ్మాయిల ముఖ వర్చస్సును దెబ్బతీస్తాయి. వీటిని పోగొట్టుకునేందుకు రకరకాల క్రీములు వాడుతుంటారు. అయితే, ఇంట్లో దొరికే పదార్థాలతోనే.. ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. ఒక గిన్నెలో రెండు టేబుల్‌స్పూన్ల ఓట్‌మీల్, ఒక టేబుల్‌స్పూన్ పెరుగు, అర టేబుల్‌స్పూన్ టమాటా రసం వేసి.. బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని నల్లని మచ్చలపై రాసి.. 15–20 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. టమాటాలో ఉండే సహజసిద్ధమైన బ్లీచింగ్ గుణాలు.. చర్మాన్ని శుభ్రపరుస్తాయి. ఓట్‌మీల్.. ఎక్స్‌ఫోలియేటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తుంది. ఇక పెరుగు.. ముఖాన్ని మృదువుగా చేస్తుంది. కలబంద గుజ్జు, తేనె.. ఒక్కో టేబుల్‌స్పూన్ తీసుకోవాలి. ఇందులో రెండు టేబుల్‌స్పూన్ల బొప్పడి గుజ్జు వేసి.. ప్యాక్‌లాగా చేసుకోవాలి. దీన్ని పిగ్మెంటేషన్ ఉన్న చోట రాసి అరగంటపాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత కడిగేసుకోవాలి. కలబందలోని సుగుణాలు.. చర్మంలో కొలాజెన్ స్థాయులను పెంచుతాయి. ముఖాన్ని మెరిపిస్తాయి. ఇక ముఖంపై మచ్చలను తొలగించడంలో తేనె సమర్థంగా పనిచేస్తుంది. బొప్పడిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్.. చర్మంపైన నల్లని మచ్చలు, మొటిమలను తగ్గిస్తుంది. గుప్పెడు పుదీనా ఆకులను మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని పిగ్మెంటేషన్ ఉన్న ప్రాంతాల్లో అప్లయి చేసి.. 10–15 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. చర్మానికి రక్త ప్రసరణను మెరుగుపరచడంలో పుదీనా సాయపడుతుంది. సోయాపాలు, నిమ్మరసం, టమాటా గుజ్జు ఒక టేబుల్‌స్పూన్ చొప్పున తీసుకొని.. మెత్తటి పేస్ట్‌గా చేసుకోవాలి. నల్లని మచ్చలమీద ఈ మిశ్రమాన్ని అప్లయి చేసి.. పది నిమిషాలపాటు సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. ఆ తర్వాత 10–15 నిమిషాలు బాగా ఆరనిచ్చి.. చల్లటి నీళ్లతో కడిగేసుకుంటే సరి. టమాటాలో ఉండే లైకోపీన్ వంటి యాంటి ఆక్సిడెంట్లు.. చర్మాన్ని యూవీ కిరణాల నుంచి రక్షిస్తాయి. చర్మ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి.ఆరెంజ్ తొక్కలను ఎండబెట్టి.. పొడిగా చేసుకోవాలి. అందులో కొద్దిగా పచ్చిపాలు కలిపి మెత్తని పేస్ట్‌గా తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పిగ్మెంటేషన్ ఉన్నచోట అప్లయి చేసుకొని.. ఇరవై నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఆరెంజ్‌లో ఉండే విటమిన్ సి, యాంటి ఆక్సిడెంట్లు.. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తాయి.

# మార్కెట్

## టాటా హారియర్ ఈవీ వచ్చేసిందోచ్

### ప్రారంభ ధర రూ.21.49 లక్షలు
### సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు

న్యూఢిల్లీ : దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ సరికొత్త ఈవీ మాడల్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా సంస్థ నూతన హారియర్ ఈవీను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది మొదట్లో నూఢిల్లీలో జరిగిన ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఈ మాడల్ ఆరు నెలల తర్వాత ప్రవేశపెట్టింది. ఈ కారు ప్రారంభ ధర రూ.21.49 లక్షలు. 75 కిలోవాట్ల బ్యాటరీ, 65 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 6.3 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 200 కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకుపోనున్నది. పనోరమిక్ సన్‌రూఫ్, 14.5 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డ్యూయల్-జోన్ ట్క్లెమెట్ కంట్రోల్ సిస్టమ్, 360 డిగ్రీల కెమెరా, 12.25 ఇంచుల పూర్తిస్థాయిలో కలర్ టచ్‌స్క్రీన్, లెవల్ 2 అడాస్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నా యి. ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ బుకింగ్‌ను ఇప్పటికే ప్రారంభించింది. బ్యాటరీ ప్యాక్‌పై జీవితకాలం వ్యారెంటీ కల్పిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం నెలకు 25 వేల యూనిట్లు అమ్ముడవుతున్న ప్రీమియం ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో ఈ వాహనంతో మరింత పెరిగే అవకాశం ఉన్నదని టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు.



## స్టీల్, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు..




### ఉత్తర్వులపై సంతకాలు చేసిన ట్రంప్

రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని 25 శాతం నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ఇటీవలే ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై ట్రంప్ తాజాగా సంతకాలు చేశారు. టారిఫ్‌లు అమెరికా కాలమానం ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 12:01 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. యూకేతో వాణిజ్య ఒప్పందం అమలులో ఉన్న నేపథ్యంలో వారికి మాత్రం టారిఫ్‌లు 25 శాతంగానే ఉండనున్నాయి. కాగా, స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని 25 శాతం నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ట్రంప్ గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే. స్వదేశీ స్టీల్ పరిశ్రమను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వం నిర్ణయం వల్ల స్థానిక స్టీల్ పరిశ్రమకు ఊతం వస్తుందని, జాతీయ సరఫరా పెరుగుతుందని, దీంతో చైనాపై ఆధారపడే సందర్భాలు తగ్గుతాయని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా స్టీల్ పరిశ్రమ అభివృద్ధి కోసం 14 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు చెప్పారు. జపాన్‌కు చెందిన నిప్పాన్ స్టీల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే ఆ డీల్‌కు చెందిన తుది నిర్ణయం ఇంకా తీసుకోవాల్సి ఉందన్నారు. స్టీల్ పరిశ్రమలో ఇక నుంచి ఉద్యోగులు తీసివేత ఉండదని, ఔట్ సోర్సింగ్ కూడా ఉండదన్నారు. ప్రతి స్టీల్ పరిశ్రమ కార్మికుడికి 5 వేల డాలర్ల బోనస్ అదనంగా వస్తుందని పెన్సిల్వేనియాలోని పిట్స్‌బర్గ్‌లో జరిగిన ర్యాలీలో ట్రంప్ చెప్పుకొచ్చారు.

## విద్యా రుణాలపై వడ్డీరేటు తగ్గించిన పీఎన్‌బీ

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ).. విద్యాలక్ష్మి స్కీం కింద విద్యా రుణాలు తీసుకునేవారికి వడ్డీరేటును 20 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు మంగళవారం ప్రకటించింది. విద్యా రుణాలు తీసుకునేవారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో బ్యాంక్ ఈ ప్రత్యేక స్కీంను తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా 860కి పైగా ఉన్నత ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు రుణాలు ఇవ్వనున్నట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. 7.5 శాతం వార్షిక వడ్డీతో విద్యా రుణాలు మంజూరు చేస్తున్నది.







# పెద్ది క్రేజ్ పెంచేలా ప్రమోషన్స్

## ముంబైలో ఒకటి..భోపాల్‌లో మరో ఈవెంట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచగా.. ఇప్పుడు మేకర్స్ ప్రమోషన్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళు న్నారు. 'పెద్ది' కోసం భారీ స్థాయిలో జాతీయ ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను ఎ÷-లాన్ చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో నిర్వహించే గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ లాంచ్‌ను కేవలం సినిమా ఈవెంట్‌గా కాకుండా, పాన్ ఇండియా స్థాయిలో భారీ ప్రచార కార్యక్రమంగా మలచాలని చిత్రబృందం భావిస్తోంది. జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను ప్రత్యేకంగా ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక ట్రైలర్ లాంచ్‌తో ప్రమోషన్స్ ఆగిపోవడం లేదు. సినిమా కథలోని భారతీయ మూలాలను సెలబ్రేట్ చేసేలా మేకర్స్ మే 23న భోపాల్‌లో ప్రత్యేక సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. 'హార్ట్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన భోపాల్‌లో ఈ వేడుకను అత్యంత వైభవంగా ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన ఆకర్షణగా ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. 'పెద్ది' చిత్రానికి సంగీతం అందిస్తున్న రెహమాన్ స్వయంగా వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు. 'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో ప్రత్యేక మ్యూజికల్ ప్రెజెంటేషన్‌ను కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రెహమాన్‌తో పాటు పలువురు ప్రముఖ గాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రైరై రారా' పాటలు సోషల్ మీడియాలో భారీ స్పందన తెచ్చుకున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ మాస్ లుక్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు పాన్ ఇండియా స్థాయిలో రెస్పాన్స్ రావడంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రానికి బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తుండగా, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' ఇప్పటికే రికార్డుల వేట మొదలుపెట్టినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోల ప్రీ-సేల్స్‌కు భారీ స్పందన లభిస్తోందని సమాచారం. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయనుండగా.. జూన్ 3 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.





# కేడీ ట్రైలర్ విడుదల

ధ్రువ్ సర్జా హీరోగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కేడీ: ది డెవిల్' మే 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజయ్ దత్ కీలకపాత్రలో నటించారు. తాజాగా దీని తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'ఇది అంతం కాదు.. ఆరంభం' అని ధ్రువ్ తన డైలాగులతో ఆకట్టుకుంటున్నారు. ఈ సినిమాలోని ఓ పాట పలు వివాదాలకు కారణమైన విషయం తెలిసిందే. దాన్ని అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ తొలగించారు. దీంతో తెలుగులో ఆ పాటను ఉంచుతారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.




# విరోష్ జోడీ..యాడ్‌కు విశేష స్పందన

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జోడీ మరోసారి సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టించింది. అభిమానులు ప్రేమగా 'విరోష్' అని పిలుచుకునే ఈ జంట తాజాగా కలిసి చేసిన ఎయిర్‌బీఎన్‌బీ కపుల్ యాడ్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో రికార్డు స్థాయిలో స్పందన అందుకుంటోంది. ఈ యాడ్ పోస్టుకు ఇప్పటికే 9.1 మిలియన్లకు పైగా లైక్స్ రావడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక లైక్స్ సాధించిన యాడ్ పోస్టుల్లో ఇది రెండో స్థానంలో నిలిచినట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆసక్తికర విషయం ఏమిటంటే.. మొదటి స్థానంలో కూడా విజయ్-రష్మిక జంటే ఉండటం అభిమానులను మరింత ఆనందం కలిగిస్తుంది. గతంలో ఈ జంట కలిసి చేసిన మాన్యవార్ వెడ్డింగ్ క్యాంపెయిన్ యాడ్ సోషల్ మీడియాలో భారీ రికార్డులు సృష్టించింది. ఆ యాడ్ పోస్టుకు 11.5 మిలియన్లకు పైగా లైక్స్ రావడంతో పాటు 100 మిలియన్లకు పైగా వ్యూస్ దక్కాయి. అప్పట్లో అది సోషల్ మీడియాలో పెద్ద సంచలనంగా మారింది. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజాలు లియోనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో కలిసి చేసిన లూయిస్ విట్టన్ యాడ్ పోస్టులతో పోలిస్తే.. విజయ్-రష్మిక యాడ్స్‌కు ఎక్కువ రెస్పాన్స్ రావడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ స్థాయి స్పందన రావడానికి ప్రధాన కారణం వీరిద్దరికీ ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్ దేవరకొండ ప్రస్తుతం దర్శకుడు రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్దన్' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ రూపొందిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'లో రష్మిక మందన్నతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక రష్మిక మందన్న కూడా వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. బాలీవుడ్‌లో షాహిద్ కపూర్‌తో కలిసి 'కాక్‌టెయిల్ 2'లో నటిస్తుండగా, తెలుగులో 'మైసా' చిత్రంలో కనిపించనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో వరుస అవకాశాలు అందుకుంటూ ఆమె కెరీర్ దూసుకెళ్తోంది.




# మైసా కోసం రష్మిక ప్రత్యేక ట్రైనింగ్

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు. ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్నని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం రష్మిక ఇప్పటికే థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక యాక్షన్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్లు తెలిసింది.




# కురుప్ప విడుదలకు ముందే ఇబ్బందులు

### చివరి నిముషంలో షోలు రద్దు

తమిళ స్టార్ హీరో సూర్య నటించిన తాజా చిత్రం కరుప్పు విడుదలకు ముందే అనూహ్య ఇబ్బందుల్లో చిక్కుకుంది. దర్శకుడు ఆర్జే బాలాజి తెరకెక్కించిన ఈ సినిమాను తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. త్రిష కృష్ణన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం మే 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో షోలు రద్దు కావడంతో అభిమానులు నిరాశ చెందుతున్నారు. షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం నుంచే థియేటర్లలో షోలు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ విడుదలకు ముందు ఆర్థికపరమైన చిక్కులు తలెత్తడంతో మార్నింగ్ షోలు నిలిచిపోయినట్లు సమాచారం. తమిళనాడులో ప్రత్యేక షోలకు అనుమతులు వచ్చినప్పటికీ, అవి కూడా రద్దు కావడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న విజయ్ ప్రభుత్వం ఉదయం 9 గంటల స్పెషల్ షోలకు పర్మిషన్ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత కూడా ఒక్క షో పడకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. బుక్‌మైషోలో ఉదయం ఆటలకు సంబంధించిన బుకింగ్స్ కనిపించకపోవడంతో పాటు, తెలుగు రాష్ట్రాల్లో కూడా పలు థియేటర్లలో మార్నింగ్ షోలు క్యాన్సిల్ అయ్యాయి. మ్యాట్నీ షోల బుకింగ్స్ కూడా రద్దు చేసినట్లు సమాచారం. ఓవర్సీస్‌లో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. అమెరికాలో ప్రీమియర్ షోలు నిలిపివేయడంతో పాటు, వీకెండ్ బుకింగ్స్‌పై కూడా అనిశ్చితి నెలకొంది. దీంతో సినిమా రిలీజ్‌పై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామాలపై నిర్మాత ఎస్ఆర్ ప్రభు సోషల్ మీడియాలో స్పందించారు. 'అనివార్య కారణాల వల్ల ఉదయం 9 గంటల ప్రదర్శనలు రద్దు చేయబడ్డాయి. అందరికీ మా హృదయపూర్వక క్షమాపణలు' అంటూ ట్వీట్ చేశారు. మాత్రం స్పష్టత ఇవ్వలేదు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ సినిమాకు సంబంధించి నిర్మాతల పాత బకాయిలే ప్రస్తుతం సమస్యలకు కారణమయ్యాయని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.



# వల్గారిటీ జోక్స్‌పై బిందు మాధవి షాకింగ్ కామెంట్స్.. జబర్దస్తకే ఇన్‌డైరెక్ట్ కౌంటరా?

తెలుగు టెలివిజన్‌లో కామెడీ షోలంటే ముందుగా గుర్తుకొచ్చేది జబర్దస్త్, ఎక్స్‌ట్రా జబర్దస్త్. ఎన్నో ఏళ్లుగా ప్రేక్షకులను అలరిస్తున్న ఈ షోలు అనేక మంది కమెడియన్స్‌కు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. చాలా మంది నటులు, యాంకర్లు, కమెడియన్స్ ఈ వేదిక ద్వారానే ఇండస్ట్రీలోకి వచ్చి స్టార్‌డమ్ సంపాదించారు. అయితే ఈ షోలపై ప్రారంభం నుంచే కొన్ని విమర్శలు కూడా వినిపిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా డబుల్ మీనింగ్ డైలాగ్స్, వల్గారిటీ జోక్స్, ఫ్యామిలీతో కలిసి చూడలేని కొన్ని స్కిట్స్‌పై సోషల్ మీడియాలో తరచూ చర్చ జరుగుతూ ఉంటుంది. ఇప్పుడు ఇదే అంశంపై హీరోయిన్, బిగ్‌బాస్ ఫేమ్ బిందు మాధవి చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఆమె నేరుగా ఏ షో పేరు ప్రస్తావించకపోయినా, నెటిజన్లు మాత్రం ఆమె కామెంట్స్‌ను జబర్దస్త్ షోకు ఇండైరెక్ట్ కౌంటర్‌గా భావిస్తున్నారు. ప్రస్తుతం బిందు మాధవి కొత్తగా ప్రారంభమైన మాస్ జాతర అనే కామెడీ షోలో జడ్జిగా వ్యవహరిస్తోంది. ఈ షో కూడా కామెడీ స్కిట్స్ ఆధారంగానే నడుస్తోంది. అయితే మిగతా షోలతో పోలిస్తే ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ క్లీన్ కామెడీ అందిస్తున్నామని షో టీమ్ చెబుతోంది. ఇటీవల ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో పాల్గొన్న బిందు మాధవి ఈ విషయంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "మాస్ జాతర పూర్తిగా ఎంటర్టైన్మెంట్‌తో నిండిన షో. మొదట నన్ను జడ్జిగా చేయమని అడిగినప్పుడు నేను వెంటనే ఒప్పుకోలేదు. ఎందుకంటే కామెడీ స్కిట్స్ అంటే ఇప్పుడు ఎక్కువగా వల్గర్ లైన్స్, డబుల్ మీనింగ్ జోక్స్ వాడుతున్నారని అనిపించింది. అలాంటి షోల్ని చూస్తూనే ఉన్నాం. అందుకే మొదట వద్దనుకున్నాను" అని చెప్పింది. అయితే తర్వాత షో డైరెక్టర్ ప్రత్యేకంగా వచ్చి తనకు హామీ ఇచ్చారని బిందు మాధవి తెలిపింది. "మా షోలో వల్గారిటీ ఉండదు. ఎక్కడైనా అలాంటి లైన్స్ ఉంటే మీరు షో మధ్యలోనే వెళ్లిపోవచ్చు అని చెప్పారు. ఫ్యామిలీ మొత్తం కలిసి చూసేలా షో రూపొందిస్తామని భరోసా ఇచ్చారు. అందుకే నేను అంగీకరించాను" అని వివరించింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com